గుంటూరు వార్త

# తెనాలిలో ఏసి మెకానిక్ దారుణహత్య

**తెనాలి మున్సిపాలిటీ జనవరి10(ప్రభాతవార్త):** పట్టణంలోని నందుల పేటకు చెందిన ఏసీ మెకానిక్ షేక్ ఫయాజ్ అహ్మద్(52) గుర్తు తెలియని వ్యక్తుల చేతులు దారుణహత్యకు గురయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి పట్టణంలోని



చెంచుపేట శివారు టీచర్స్ కాలనీ వద్దకు స్కూటీపై వచ్చిన ఫయాజ్ అహ్మద్ ను గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా కొట్టి, మరణాయుధాలతో దాడి చేసి హత మార్చారు. హత్య కేసు విషయం తెలియగానే త్రీటౌన్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. త్రీ టౌన్ సిఐ సాంబశివరావు ప్రమాదవస్థలి లోనే ఉండి క్లూస్ టీం డాగ్ స్క్వాడ్లను రంగంలోకి దింపి అనుమానితులను విచారిస్తున్నారు. హత్యకు వివాహేతర సంబంధం కారణమా లేక కొందరు వ్యక్తులు మద్యం మత్తులో ఘర్షణ బడి హత్యకు దారితీసిందా అన్న కోణంలో పలు అనుమానాలకు తావిస్తోంది. డీఎస్పీ బి. జనార్ధన రావు హత్య జరిగిన ప్రాంతాన్ని శనివారం ఉదయం పరిశీలించారు. పోలీసులకు తెలిసిన సమాచారం మేరకు, హతుడు ఫయాజ్ శుక్రవారం రాత్రి 11 గంటలకు టీచర్స్ కాలనీలోని తనకు పరిచయమున్న మహిళ ఇంటికి వద్దకు రాగా, అక్కడే కాపుగాసిన కొందరు అతనిపై దాడి చేసి హతమార్చినట్లు, తెలుస్తుందని, క్లూస్‌టీం ఆధారాలు సేకరిస్తుందని, హత్యకుగల కారణాలు తెలియాల్సి ఉందని, దర్యాప్తు ముమ్మరం చేశామని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని డిఎస్పి తెలిపారు.

## నగరంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా

# సంక్రాంతి సంబరాలు

### నగర మేయర్ కోవెలమూడి

**నేటి నుంచి ఎన్టీఆర్ స్టేడియంలో తూర్పులో 13 నుంచి 15 తేదీ వరకు కార్మిక శాఖ స్థలంలో నిర్వహణకు భారీ ఏర్పాట్లు**

**గుంటూరు కార్పొరేషన్, జనవరి 10, ప్రభాతవార్త** : గుంటూరు నగరంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహించే కంటే ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్టు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో నగర కమీషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంక్రాంతి సంబరాల విషయాలను వెల్లడించారు. ఈనెల 11 నుంచి ఈ సంక్రాంతి సంబరాలు ప్రారంభించడం జరుగుతుందని ప్రతి ఒక్కరు సంబరాల్లో పాల్గొని ఆనందోత్సాలతో గడిపి విజయవంతం చేయాలని వైభవంగా కార్మిక శాఖ స్థలంలో ఈ సంబరాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సంబరాల ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు 666 మంది శాస్త్రీయ నృత్య కళాకారులతో నిత్య ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ, ప్రముఖులు ఈ సంబరాల్లో పాల్గొనాలని కోరారు. క్రికెట్, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్, రంగోలి పోటీలు జరుగుతాయని ఆసక్తి కలిగిన టీములు ఎన్టీఆర్ స్టేడియంలో 9492871972, 9642983416 సెల్ నెంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే నర్సిర అహ్మద్ మాట్లాడుతూ మేయర్, కమిషనర్ల సహకారంతో మన గుంటూరు మన సంక్రాంతి పేరుతో తూర్పు నియోజకవర్గం లోని కాకుమని వారి తోటలో ఉన్న కార్మిక శాఖ స్థలంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.



కోరారు. ప్రతి ఏడాది ఎన్టీఆర్ స్టేడియంలో మాత్రమే జరిగాయని ఈ ఏడాది తొలిసారిగా తూర్పు నియోజకవర్గం లో కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎన్టీఆర్ స్టేడియం లో 11వ తేదీ నుంచి, 13 నుంచి 15 వరకు తూర్పు నియోజకవర్గం లోని కాకుమాని వారి తోటలో ఉన్న కార్మిక శాఖ స్థలంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీడియో క్రీడా పోటీలు, మహిళలకు రంగోలి పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలతో జరిగే సంబరాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఆనందోత్స వాలతో గడపాలని కోరారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ గత ఏడాదిలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు విశేషమైన స్పందన వచ్చిందన్నారు. అదేవిధంగా ఎప్పటి నుంచో గుంటూరు తూర్పు లో నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారని, ఎమ్మెల్యే అభ్యర్థుల మేరకు మూడు రోజులపాటు అంగరంగ సంక్రాంతి అంటే సంస్కృతి, శ్రమకు గుర్తింపు అని వాటిని ప్రతిబింబిస్తూ సంబరాలు జరుగుతున్నాయి అన్నారు. ఈ సంబరాలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశం అనంతరం కార్మిక శాఖ స్థలంలో సంక్రాంతి



సంబరాల కోసం చేపడుతున్న పనులను నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ లు కలిసి పరిశీలించారు. స్థలం శుభ్రం చేసే పనులు వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు.

## నిబంధనలకు విరుద్ధంగా కోడి పందేల నిర్వహణకు

# సమాయత్తం

**చట్టాల అమలుకు ప్రజల డిమాండ్**

రేపల్లె-ప్రభాతవార్త

సంక్రాంతి సందర్భంగా తీరప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే కోడి పందాల నిర్వహణపై పోలీస్ అధికారులు చట్ట నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారా ? ప్రజాప్రతినిధుల వత్తిళ్ళకు తలొగ్గుతారా ? అనే ప్రశ్నలను ప్రజలే సంధిస్తున్నారు. జూద నిరోధక చట్టాల కింద కోడి పందాలను నిషేధించారు. కోడి పందాల పోరు వినోదాత్మకంగా పలువురు భావిస్తున్నప్పటికీ కోడి పందాలను ఒక జూదంగానే చట్టాలు గుర్తు



చేస్తున్నాయి. అయితే భోగి, మకర సంక్రాంతి, కనుమ రోజులలో కోడి పందాల నిర్వహణకు కొందరు సమాయత్తమవుతున్నారు. ఆర్థిక పరిస్థితులను అతలాకుతలం చేసే కోడిపందాల పట్ల తమ అదృష్టం కొద్దీ గెలుచుకోలేకపోతామా అనే ఆసక్తిని పెంపొందించేలా ప్రచారం జరుగుతోంది. రూ.10 వేలు, రూ.25 వేలు, రూ.50 వేలు, రూ.లక్ష స్థాయి బరులలో కోడి పందాలు జరుగుతుంటాయి. ఈ పందాలను వీక్షించేవారు పైపందాలు కాస్తుంటారు. బడేవారిపాలెం, పల్లెకోన తదితర ప్రాంతాలలో కోడి పందాల బరులు ఏర్పాటు చేస్తున్నట్లు బాహాటంగానే ప్రచారం జరుగుతోంది. రేపల్లె నియోజకవర్గంలో అనుకూలమైన గ్రామాలలో కూడా కోడి పందాలను నిర్వహించాలనే ఆలోచనలో రాజకీయపరపతి కలిగిన కొందరు ఉన్నట్లు ప్రజలలో చర్చనీయాంశమైంది. పందెం కోళ్ళకు కత్తులు కట్టి బరిలోకి దింపడమనేది చట్ట విరుద్ధమైనప్పటికీ ఎవరూ పట్టించుకునే పరిస్థితిలో లేరు. పందెం కోళ్ళకు కత్తులు తయారు చేసేవారిపై, కోడి పుంజుల కాళ్ళకు 3-4 అంగుళాల పొడవు కలిగిన చుర కత్తులు కట్టి పందెంలోకి దించేవారిపై అధికారులు నిఘా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏపి గేమింగ్ యాక్టు 1974, జంతు హింస నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసేలా నిబంధనలు ఉన్నాయి. కత్తులు కట్టడం, బెట్టింగ్‌లు వేయడం శిక్షార్హమైన నేరాలుగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నిషేధం అమలులో ఉన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. భారీగా బెట్టింగ్‌లు, బహిరంగంగా మద్యం విక్రయాలకు పాల్పడితే చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంటుంది. కోడి పందాలు నిర్వహించడం చట్టవిరుద్ధమని, తమకు పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎంత వరకు ఫలిస్తుందో చూడాలి. ఏడాది కాలంగా శిక్షణనిచ్చిన కోడి పుంజులను పందెం బరిలోకి దింపేందుకు కొందరు సిద్ధంగా ఉన్నారు. పందెం కోళ్ళ రకాలను పరిశీలిస్తే నల్లని ఈకలు కలిగిన కాకి, ఎరుపు రంగు ఈకలు కలిగిన డేగ, తెల్లని ఈకలు కలిగిన సేతు, తెలుపు ఈకలు, మెడపై నలుపు ఈకలు కలిగిన పర్ల, నల్లటి శరీరం, రెండు మూడు రంగుల ఈకలు కలిగిన



కొక్కిరాయి, రెక్కలపై వీపుపై పసుపు రంగు ఈకలు కలిగిన నెమలి, నలుపు, ఎరుపు, పసుపు ఈకలు కలిగిన కౌజు, ఎరుపు, బూడిద రంగుల ఈకలు కలిగిన మైల, ఒక్కొక్క ఈకపై నలుపు, తెలుపు, ఎరుపు రంగులు కలిగిన పూల, తెలుపు రెక్కలపై అక్కడక్కడా నలుపు రంగు, లేత గోధుమ రంగు ఈకలు కలిగిన పింగళ, జూలు రంగు కలిగిన ముంగిస, లేత బంగారు రంగు ఈకలు కలిగిన అబ్రాసు, తెలుపు, లేత ఎరుపు ఈకలు కలిగిన గేరువా, నల్లబోర, ఎర్రవాడ వంటి రకాలు కలిగిన కోడి పుంజులకు శిక్షణనిచ్చి పోటీకి సిద్ధం చేస్తున్నారు. ఈ పుంజులకు వ్యాయామంతో పాటు ప్రత్యేక ఆహారాన్ని అందిస్తున్నారు. శిక్షణలో ఆరితేరిన కోడి పుంజును పైకెత్తి కిందకు దించడం, కోడి పుంజును ఎదుటి పుంజుకు చూపించి పందాలు నిర్వహించే పద్ధతులను అవలంభిస్తున్నారు. కోడి పుంజుల కాళ్ళకు కత్తులు, బ్లేడ్లు కట్టి పందాలు నిర్వహించి కోడి పుంజులలో ఒకటి మరణించినా బరి నుంచి తప్పించుకుని పారిపోయినా బరిలో పోరాడి నిలబడ్డ పుంజును విజేతగా నిర్ణయిస్తారు. ప్రాచీన కాలంలో ఇంటి కోళ్ళు, అడవి కోళ్ళ మధ్య పోరాటం వినోదంగా భావించేవారు. 1178వ సంవత్సరం నుంచి 1182వ సంవత్సరం వరకు జరిగిన పల్నాటి యుద్ధం ఫలితం కోడి పుంజుల పందాల ద్వారా నిర్ణయించారంటే కోడి పందాలకు అంతటి ప్రాధాన్యత ఉంది. బొబ్బిలి యుద్ధంలోనూ కోడి పుంజుల పందాలు జరిగినట్లు చరిత్ర తెలుపుతోంది. భారతదేశంలో అయితే కోడి పందాలపై నిషేధం కొనసాగుతోంది. కోడి పందాలు నిర్వహించే ప్రాంతాలలో విభిన్న రకాల జూదాలను నిర్వహించడం, మద్యం విక్రయాలు కొనసాగించడం వంటి చట్ట నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే పరిస్థితులు గతంలో మాదిరిగా కొనసాగుతాయా లేక అధికార యంత్రాంగం చర్యలకు పూను కుంటుందో లేదో వేచి చూడాల్సిందే.

**సంక్రాంతి పర్వదినం అంటే..**

దక్షిణాయానికి ఆఖరి రోజుగా పరిగణిస్తూ భోగి నిర్వహిస్తారు. అనుభవించిన కష్టాలు, సమస్యలన్నీ భోగి మంటల రూపంలో అగ్ని దేవుడికి సమర్పించి ఉత్తరాణ కాలంలో సుఖసంతోషాలను పొందే విధంగా భగవంతుడిని ప్రార్థిస్తారు. తెల్లవారు జామున భోగి మంటలు వేస్తారు. సాయంకాలం సమయంలో చిన్నారులపై భోగిపళ్ళను పోస్తారు. పురాణాలను తీసుకుంటే శ్రీమహావిష్ణువుకు భోగి పర్వదినం అంటే ఇష్టం. ధనుర్మాసంలో గోదాదేవి నెలరోజుల పాటు చేసి వ్రతానికి సంతోషించి రంగనాధుడే భూమి మీద ప్రత్యక్షమయ్యాడు. శ్రీ రంగనాథస్వామిలో గోదాదేవి లీనమై భోగాన్ని పొందడానికి సంకేతంగా భోగి పండుగ అమలులోకి వచ్చినట్లు పురాణవేత్తలు పేర్కొంటున్నారు. ఉత్తరాయణ పుణ్యకాలంలో సూర్యుడు మకరరాశిలో మారే రోజును సంక్రాంతిగా భావిస్తాం. శారీరక శ్రమకు, పూజా కార్యక్రమాలకు తగిన సమయం. రైతులు పండించిన పంటల దిగుబడులు చేతికి వచ్చిన సమయంలో శ్రమకు తగిన ప్రతిఫలంగా భావించి ఆనందంగా సంక్రాంతిని జరుపుకోవడం అనాదిగా వస్తోంది. సూర్యుడిని పూజించడం, నదీ స్నానం, దానధర్మాలు చేయడం వంటి పుణ్యకార్యక్రమాల నిర్వహణకు అనువైన సమయం. కోడి పందాలు వేయడం సాంప్రదాయ మని చెబుతున్నారు కాని వాస్తవానికి రంగు రంగుల ముగ్గులు వేయడం, గంగిరెద్దుల మేళాలు, డూడూ బసవన్నల సందడి, హరిదాసుల కీర్తనలతో గ్రామీణ ప్రాంతాలు ఉత్సాహభరితంగా మారతాయి. కొత్త అల్లుళ్ళను ఆహ్వానించి నూతన వస్త్రాలు, రుచికరమైన పిండి వంటలు, ఉమ్మడి కుటుంబాల కలయిక వంటి సందడి వాతావరణం నెలకొంటుంది. కనుమ రోజును పశువుల పండుగగా జరుపుకుంటారు. సంవత్సరం పొడవునా సహాయం చేసిన పశువులకు కృతజ్ఞతలు తెలుపుతూ వాటిని అలంకరించి పూజించడాన్ని రైతులు కొనసాగిస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు సంక్రాంతి సందర్భంగా ఆరోగ్యానికి మేలు చేసే నువ్వుల ఉండలు, బెల్లంతో చేసిన అరిసెలు, బూరెలు, లడ్డులు వంటి తీపి పదార్థాలను బంధువులకు, స్నేహితులకు పంచిపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ప్రకృతి, వ్యవసాయం, కుటుంబ సంబంధాలు, ఆధ్యాత్మికతకు మధ్య వారధిగా నిలుస్తున్న సంక్రాంతి పర్వదినం అంటే ఇష్టపడనివారు ఎవరుంటారు.

## ఏఎన్‌యులో ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి : ఎస్ఎఫ్‌డి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జనవరి10, ప్రభాతవార్త: ఏఎన్‌యులో విద్యార్థులు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడేందుకు బాధ్యత తీసుకోవాలని స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ (ఎస్ఎఫ్‌డి) స్టేట్ కో కన్వీనర్ కలగట్ల బాల కాశిం, ఏఎన్‌యు కన్వీనర్ వెంకటేష్, అధ్యక్షుడు హేమంత రామ్, కార్యదర్శి మధులు సూచించారు. స్వామి వివేకానంద 163వ జయంతి సందర్భంగా ఏఎన్‌యు ఎస్ఎఫ్‌డి




ఆధ్వర్యంలో వర్సిటీ ప్రాంగణంలో ప్లాస్టిక్‌ను తొలగించారు. విద్యార్థులు బాధ్యతగల పౌరులుగా ఎదిగేందుకు పర్యావరణ పరిరక్షణను సవాలుగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏఎన్‌యులో ఏఐఎస్ఎఫ్ విద్యార్థుల నిరసన

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జనవరి10, ప్రభాతవార్త:** ఏఎన్‌యులో ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం మహిళా కార్యదర్శి అంజలి డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ఏఎన్‌యు వద్ద నిరసన వ్యక్తం చేశారు.. ఈ సందర్భంగా అంజలి మాట్లాడుతూ ఫీజు రీఎంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో వేలాదిమంది విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు



ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఫీజు రీఎంబర్స్‌మెంట్ పథకాన్ని పూర్తిగా మరచిపోయినట్లుగా వ్యవహరిస్తుందని విమర్శించారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఫీజులు చెల్లించేందుకు అనేక అవస్థలు పడుతున్నారని వాపోయారు. ఇదే పరిస్థితి కొనసాగితే విద్యార్థులు విద్యకు దూరమౌతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బకాయిలు విడుదల చేయాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ అంశంపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఖాజా, నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

## 2 గంజాయి కేసుల్లో 11మంది నిందితుల అరెస్టు



>> 10

## సంక్రాంతి సంబరాల పేరుతో

# కార్పొరేషన్ ఖజానాకు కన్నం

**-కార్మిక శాఖ స్థలంలో కార్పొరేషన్ నిధులతో పనులు..**
**-రూ. 5లక్షలు కూడా కాని ఖర్చుకు రూ. 15 లక్షల పైగా బిల్లులు పెట్టేందుకు వ్యూహం..**
**-బి ఆర్ స్టేడియంలో ఏ ఖర్చు లేకుండా పెట్టే కార్యక్రమాన్ని లక్షలు ఖర్చు చేసి ఇక్కడ పెట్టడం పై ప్రజల విమర్శలు..**
**-ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకున్న గుంటూరు నగరం..నిత్యం నరకం అనుభవిస్తున్న ప్రజలు..**
**-తూర్పు నియోజకవర్గం 90శాతం ఉన్న ప్రాంతంలో కాకుండా కేవలం 10శాతం మాత్రమే ఉన్న చోట సంబరాలా...!..**
**-తూర్పులో తొలిసారిగా పెట్టే సంబరాలకు హాజరు కావాలంటే 3 వంతెనల మార్గం ఒక్కటే కావడంపై ప్రజలలో అసంతృప్తి జ్వాల..**

**గుంటూరు కార్పొరేషన్, ప్రభాతవార్త :** గుంటూరు కార్పొరేషన్ పరంగా ప్రతి ఏడాది నిర్వహించే సంక్రాంతి సంబరాలు ఈసారి పసుపు చొక్కా నేతలకు... కొంతమంది అధికారులకు కాసుల కురిపించేలా జరగనున్నాయనే విమర్శలు నగర ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం జరిగే ఈ సంబరాలకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక ప్రత్యేకత ఉంది. ప్రతిసారి కార్పొరేషన్ పరంగా నిర్వహించే సంక్రాంతి సంబరాలు గార్డెన్స్ లోని కార్పొరేషన్ కు చెందిన ఎన్టీఆర్ స్టేడియంలో మాత్రమే జరిగాయి. ఈసారి మాత్రం గుంటూరు తూర్పు నియోజకవర్గం లో, పశ్చిమ నియోజకవర్గంలో వేర్వేరుగా నిర్వహించాలని నియోజకవర్గ ప్రజా ప్రతినిధుల కోరిక మేరకు కార్పొరేషన్ పాలకవర్గం ఒక నిర్ణయానికి వచ్చింది. ఇంతవరకు బాగానే ఉన్నా పశ్చిమ నియోజకవర్గంలో మాత్రం ఎన్టీఆర్ స్టేడియంలో పెట్టేందుకు తీర్మానించారు. ఇకపోతే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఈ సంక్రాంతి సంబరాలు నిర్వహించేందుకు బొంగరాల బీడు హిందూ స్మశాన వాటిక వెనుక ప్రాంతంలో ఉన్న కార్మిక శాఖకు చెందిన స్థలాన్ని ఎంపిక చేశారు. అయితే అప్పటికే పిచ్చి చెట్లు, మొక్కలతో అధ్వానంగా ఉంది. ఈ స్థలాన్ని కొంత భాగం ప్రభుత్వం ఆసుపత్రి కేటాయించింది. మరికొంత స్థలం వాకింగ్ ట్రాక్ నిర్వహించేందుకు కార్పొరేషన్ అధికారులు కోరుతున్నారు. ఇప్పటివరకు కార్మిక శాఖ అధికారులు కార్పొరేషన్ కు స్థలం కేటాయిస్తున్నట్టు ఎటువంటి అనుమతులు అధికారికంగా మంజూరు చేయలేదు. అయినా సరే ఓ పథకం ప్రకారం ఇక్కడే కార్మిక శాఖ స్థలంలోని తూర్పు నియోజకవర్గంకు సంబంధించి సంక్రాంతి సంబరాలు నిర్వహించాలని ప్రజా ప్రతినిధులు పట్టుబట్టి అధికారులతో నిధులు మంజూరు చేయించుకున్నట్లు సమాచారం. ఖీ" సంక్రాంతి సంబరాల పేరుతో కార్పొరేషన్ ఖజానాకు కన్నం ఖీఖీ వేస్తున్నారనే విమర్శలు పెద్ద ఎత్తున ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. కేవలం 5 లక్షల లోపు మాత్రమే ఖర్చు అయ్యే పనులకు సంక్రాంతి సంబరాల పేరుతో




రూ. 15 లక్షల రూపాయల పైగా బిల్లులు డ్రా చేసుకునేందుకు వ్యూహాన్ని రూపొందించుకున్నారని ప్రజా ప్రతినిధులతో పాటు పచ్చ చొక్కా నేతలు, కార్పొరేషన్ అధికారుల కీలక పాత్ర ఉందని ప్రజలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సొమ్ము వృధాగా ఖర్చు చేయమని గొప్పలు చెప్పే నేతలు, కార్పొరేషన్ అధికారులు పన్నుల రూపేనా ప్రజల నుంచి

>> 10

## ఏఎన్‌యు దూరవిద్య పరీక్షలపై 12న సమీక్ష

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జనవరి10, ప్రభాతవార్త:** ఏఎన్‌యు దూరవిద్య పరీక్షలు ఈనెల 20నుంచి జరుగనున్నాయి. ఈమేరకు దూరవిద్య కేంద్రం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పరీక్షలకు సంబందించి ఈనెల 11న ఆదివారం పరిక్షా కేంద్రాల ఛీఫ్ సూపరింటెండెంట్‌లతో సమావేశం నిర్వహించాలని అధికారులు భావించారు. కానీ అనివార్య కారణాల వల్ల ఆదివారం జరగాల్సిన సమావేశం సోమవారం జరుగుతుందని దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు ప్రభాతవార్తతో తెలిపారు. ఈ సమావేశంలో పరిక్షల నిర్వహణ వంటి అంశాలపై రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ ఛీఫ్ సూపరింటెండెంట్‌లకు తగు సూచనలు చేయనున్నారు. ఉదయం 11.గం.లకు దూరవిద్య భవనంలో సమావేశం జరుగుతుంది.

**గత నివేదికల పరిశీలన..!**

దూరవిద్య పరీక్షలకు సంబందించి పరిక్షా కేంద్రాల ఎంపిక, అబ్జర్వర్‌లు, స్క్వాడ్ బృందాల నియామకం వంటి అంశాలపై గత నివేదికలను అందజేయాలని అధికారులు ఆదేశించినట్లు తెలిసింది. గతంలో కొన్ని కేంద్రాలలో మాస్ కాపీయింగ్ జరగటంతో ఆ పరిక్షా కేంద్రాన్ని మార్చి మరొక కేంద్రాన్ని ఎంపికచేశారు. ఈ సారి అవకతవకలు జరుగకుండ ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు ఆయా అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టిసారించాల్సి ఉంది. ఉదాసీన ధోరణిలో ఉంటే వర్సిటీ ప్రతిష్టకు భంగం కలుగనుంది. చాలా యూనివర్సిటీలు దూరవిద్య పరిక్షల నిర్వహణలో కొంత ఇబ్బందులు పడిన సందర్భాలు కనిపిస్తుండగా ఏఎన్‌యు పరిక్షలపై కూడా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. అదే విధంగా పరిక్షా కేంద్రాలలో విద్యార్థుల కేటాయింపు అంశాలపై వస్తున్న ఆరోపణలకు వర్సిటీ చెక్ పెట్టాలని పలువురు కోరుతున్నారు. ఈ అంశాలపై సోమవారం జరిగే సమావేశంలో చర్చ జరుగనుందని తెలిసింది.




## సంక్రాంతి సంబరాలలో కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలి : మేయర్

**గుంటూరు కార్పొరేషన్, జనవరి 10 ( ప్రభాతవార్త ) :** గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో, తొలిసారిగా తూర్పు నియోజకవర్గం లో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాల్లో కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర పిలుపునిచ్చారు. ఈ ఏడాది సంక్రాంతి సంబరాలను తెలుగుదనం ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించడం జరుగుతుందని వివరించారు.



ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని సంక్రాంతి సంబరా లను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ డివిజన్లకు చెందిన కార్పొరేటర్లు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

## గిన్నీస్ రికార్డు కోసం చిన్నారుల నృత్య ప్రదర్శన

# అభినందనీయం

**గుంటూరు కల్చరల్, జనవరి 10, ప్రభాతవార్త :** గిన్నీస్ వరల్డ్ రికార్డు కోసం సామూహికంగా చిన్నారులు చేసిన భరతనాట్య ప్రదర్శన అభినందనీయమని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గల్లా మాధవి అన్నారు. గత నెల 27న హైదరాబాద్ సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారులు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభ చాటడం సంతోషకరమన్నారు. అనంతరం చిన్నారులు రెజేటి యోషిక, యజ్ఞశ్రీ, శాన్విక నీహారిక, హాసినీలను ఆమె సత్కరించి ఆశీస్సులు



గచ్చిబౌలీ స్టేడియంలో గిన్నీస్ వరల్డ్ రికార్డు నమోదు కోసం చిన్నారులు సామూహికంగా నృత్య ప్రదర్శన నిర్వహించారు .అందులో గుంటూరు నుండి 5గురు చిన్నారులు ఆనృత్య ప్రదర్శనలో పాల్గొని ఆహుతులను అలరించారు. శనివారం స్థానిక శ్రీనివాసరావుపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నృత్యప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులను ఎమ్మెల్యే మాధవి అందజేశారు. ఈ కార్యక్రమంలో 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల రమణ, మిర్చి యార్డు మాజీ వైస్ చైర్మన్ సుభాని, మాజీ కార్పొరేటర్ వంజరాపు రత్నకుమారి, ఆర్ఆర్‌కె క్యాటరింగ్ నిర్వాహకులు రెజేటి రామకృష్ణ, ఉపాధ్యాయిరాలు దివ్యభారతి, చింతకాయల సాయి, తోట రామకృష్ణ, కొత్తకోట ప్రసాద్, గౌస్, యర్ర బాష, నాగుర్ వలి, తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ జాన్స్ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు



కారంపూడి, జనవరి 10 ప్రభాతవార్త: స్థానిక సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కరస్పాండెంట్ రెవరెండ్ మర్రి అనిల్‌కుమార్ హాజరయ్యారు. భోగి మంటలు, ముగ్గుల పోటీలు, గాలిపటాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాటాన్లడుతూ సంక్రాంతి మన దేశంలో, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో చాలా ముఖ్యమైన పండుగ అన్నారు. ఈ పండుగలో భోగి, సంక్రాంతి, కనుమల విశిష్టతను వివరించారు. విద్యార్థులకు భోగిపళ్లు వేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సిస్టర్ బినోమ, ముఖ్యఅతిథి ఫాదర్ శేఖర్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హరిదాసు వేషధారణలో భోగి మంటలు వేస్తూ విద్యార్థులు సంతోషంగా గడిపారు.

## అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్న ఎంపీ, ఎమ్మెల్యే

కారంపూడి, జనవరి 10 ప్రభాతవార్త: కారంపూడి మండలంలో ఈ నెల 11న జరగనున్న అభివృద్ధి కార్యక్రమాలకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు. కారంపూడిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన శంకుస్థాపన, మినీ గోకులం షెడ్ ప్రారంభం, బాలయోగి గురుకులంలో తరగతి గదులకు శంకుస్థాపన, ఒప్పిచర్ల గ్రామంలో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ, మినీ గోకులం షెడ్లు ప్రారంభం, మిరియాల గ్రామంలో సీసీ రోడ్లు, సైడు కాలువలు ప్రారంభం, ఆరోగ్య కేంద్రం భవనం శంకుస్థాపన, నరమాలపాడు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనానికి శంకుస్థాపన, నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, మినీగోకులం షెడ్ ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## సంక్షేమ పథకాలకు దూరం చేశారు- పట్టించుకోని అధికారులు

కారంపూడి, జనవరి 10 ప్రభాతవార్త: దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వని చందాన రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుంటే గ్రామ సచివాలయ అధికారులు సంక్షేమ పథకాలకు దూరం చేస్తున్నారని మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామానికి చెందిన రైతు గాడిపత్రి అనంతరామయ్య శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు నెలల నుంచి రేషన్ ఇవ్వకుండా, కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇస్తున్న పీఎం కిసాన్ పడలేదన్నారు. ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు. గ్రామంలో ఉండి పొలం సాగు చేసుకుంటున్నా అధికారుల నిర్వాకంతో రికార్డుల్లోనే తొలగించారని తెలిపారు. బతికి ఉన్న నన్ను ఆన్‌లైన్‌లో మాత్రం తమ పేరు లేదంటూ వాపోయారు. అధికారుల పనితీరు ఏవిధంగా ఉందోనని, నాలాంటి రైతులు ఇబ్బంది పడకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



## కారంపూడిలో డూప్లికేట్ ఫోన్‌పే దొంగ

కారంపూడి, జనవరి 10 ప్రభాతవార్త: స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో వైష్ణవి ఫ్యాన్సీ స్టోర్ దుకాణంలో శనివారం ఫోన్‌పే దొంగ ప్రత్యక్షమయ్యాడు. తన వాళ్లకు సీరియస్‌గా ఉంది. అర్జంటుగా డబ్బులు కావాలంటూ దుకాణ యజమానిని అడగ్గా ఫోన్‌పే ద్వారా స్కాన్ చేసినట్లే చేసి రూ.15 వేలు పే చేసినట్లు స్కీన్‌షాట్ చూపించడంతో దుకాణ యజమాని రూ.15 వేలు ఇచ్చాడు. రెండు నిమిషాల తర్వాత ఫోన్‌కు నగదు జమ అయినట్లు మెసేజ్ రాకపోవడంతో తను మోసపోయినట్లు గ్రహించాడు. నగదు లావాదేవీల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు తెలిపారు.



## సాగరుమాత చర్చిని సందర్శించిన 'తెలుగు మహిళ' నేతలు



సత్తెనపల్లి, జనవరి 10, ప్రభాతవార్త: సత్తెనపల్లి నియోజవర్గ తెలుగు మహిళలు శనివారం స్థానిక సాగరుమాత చర్చిని సందర్శించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ భీమినేని వందన దేవి ,సత్తెనపల్లి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు తోట అంబిక,టౌన్ మహిళా అధ్యక్షురాలు కందిమల్ల రజనీ , గాదె అనురాధ ,విజయ ,సుశీల,నాగవర్ధనమ్మ ,మల్లీశ్వరి,రాజేశ్వరి,ఓమనా తదితనేలే పాల్గొన్నారు

## భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



సత్తెనపల్లి, జనవరి 10, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలో రైల్వే స్టేషన్ రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో ధనుర్మాస పూజలలోని భాగంగా శనివారం శ్రీవారిని ఆండళక్కుం మెయ్యన్ అలంకరణలో దర్శనమిచ్చారు. ఇది శ్రీరంగనాథుడి (విష్ణువు) యొక్క ఒక రూపం, ముఖ్యంగా తిరువాదనూర్ ఆలయంలో ప్రధాన దైవంగా కొలుస్తారు, దీనిని వైష్ణవ దివ్యదేశాలలో ఒకటిగా భావిస్తారు. అర్థం: "ఆండళుక్కుమ్ మెయ్యన్" అంటే "ఆండాళ్ (గోదాదేవి) కి నిజమైన (లేదా ప్రియమైన)వాడు" అని అర్థం, ఇది విష్ణువును సూచిస్తుంది,

## చౌకధరల దుకాణం సీజ్



సత్తెనపల్లి, జనవరి 10, ప్రభాతవార్త: సాధారణ తనిఖీల్లో భాగంగా సత్తెనపల్లి పట్టణ పరిధిలోని చౌకదరల దుకాణం నెంబర్ 0783002లో సత్తెనపల్లి సివిల్ సప్లైస్ డిప్యూటీ తహాశిల్దర్ ,మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ తనిఖీలు నిర్వహించారు. ఈ దుకాణంలో ఈపాస్ మిషన్ నందు గల నిల్వల వివరములకు భౌతిక నిల్వల వివరములు సరిపోల్చగా 18 క్వింటాలు బియ్యం ఉండవలసిన నిల్వ 25 క్వింటాళ్లు గా ఉన్నందున సదరు షాపు నిర్వాహకుని పై పౌర సరఫరాల చట్టం ప్రకారం కేసు నమోదుకు చేసిషాప్ ను సీజ్ చేశారు.

## ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేత



సత్తెనపల్లి, జనవరి 10, ప్రభాతవార్త: సంక్రాంతి పండుగ సందర్భంగా శనివారం శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వంద మందికి పైగా మహిళలు, బాలికలు ముగ్గుల పోటీలలో ఉత్సాహం గా పాల్గొన్నారు. పోటీలలో విజేతలైన మహిళలకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల్లో విజేతలకు బహుమతులను ఆశ్రమ ట్రస్ట్ బాధ్యులు చింతాడ ప్రభావతి, సూర్య ప్రకాష్, డాక్టర్ సి ఎస్ జి ఎల్ యం కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. సైదా నాయక్ బహుమతులు అందించారు.

## శ్రీనివాసునికి ప్రత్యేక అలంకరణ



సత్తెనపల్లి, జనవరి 10, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలో కూరగాయల మార్కెట్ వద్ద వున్న శ్రీ రామాలయం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం లో శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ధనుర్మాసంలో భాగంగా 26 రోజున స్వామి వారికి ప్రత్యేక శనివారం కావడంతో పండ్లు తో ప్రత్యేక అలంకరణ చేశారు.. అలాగే శ్రీ రామచంద్ర మూర్తిని ప్రత్యేక అలంకరణ చేశారు స్వామివార్లను చూసేందుకు భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు సేకరించారు.. ఈ కార్యక్రమంలో ఆలయం కమిటీ సభ్యులు మహిళలు భక్తులు పాల్గొన్నారు.

## సంక్రాంతి సందర్భంగా ప్రీమియర్ లీగ్ క్రికెట్ ఓటర్నీ



సత్తెనపల్లి రూరల్, జనవరి 10, ప్రభాతవార్త: సత్తెనపల్లి రూరల్ మండలం నందిగామ గ్రామం లో సంక్రాంతి పండుగ సందర్భంగా నందిగామ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమం లో ముఖ్య అతిధి గా పాల్గొన్న సాయికృష్ణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డా సింగరాజు సాయికృష్ణ. సింగరాజు మాట్లాడుతూ నందిగామ గ్రామంలో సంక్రాంతి సందర్భంగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొంటున్న క్రీడాకారులకు ముందుగా అభినందలు తెలిపారు. ముందుగా ఆయన స్థానిక గ్రామ పెద్దలు రూరల్ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆళ్ళ అమరేశ్వర రావు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అచ్చయ్యతో కలిసి టోర్నమెంట్ ని ప్రారంభించి ఇరు జట్లు కు శుభాకాంక్షలు తెలిపి టిషర్ట్స్ పంపిణీ చేసారు.ఈ కార్యక్రమం లో శొంఠినేని మార్కొండేయులు , టోర్నమెంట్ నిర్వాహకులు గోపాల్, శివ ప్రసాద్, మణికంఠ మరియు క్రీడాకారులు నందిగామ గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ఘనంగా సంక్రాంతి సంబరాలు

సత్తెనపల్లి, జనవరి 10, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలోని కొత్తపేట మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద సంక్రాతి పర్వదిన సందర్భంగా వాసవి మణికంఠ క్లబ్ ఏర్పాటు చేసిన. ముగ్గుల పోటీలలో పాల్గొని



గెలుపొందిన వారికీ బహుమతులు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మహిళలను ప్రోత్సహించడానికి చేసిన కార్యక్రమాలు. ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఇంత ఆదరణ ఇస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లోని కూటమి రాష్ట్ర,జిల్లా, నియోజకవర్గ, పట్టణ, వార్డు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## శ్రీ వైష్ణవిలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

సత్తెనపల్లి, జనవరి 10, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలోని శ్రీ వైష్ణవి ప్రగతి జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ప్రగతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ మక్కెన అచ్చయ్య ముఖ్య అతిథిగా పాల్గొని సంక్రాంతి వేడుకల కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు కళాశాల సిబ్బంది భోగిమంట చుట్టూ తిరుగుతూ నృత్యం చేశారు. విద్యార్థులు ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగల



విశిష్టతను చాటుతూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కళాశాలల డైరెక్టర్ దగ్గుబాటి శివ బ్రహ్మారెడ్డి ప్రసంగించారు.శ్రీ తారక చక్రపతి నాట్యకళానిలయం వ్యవస్థాపకులు తేనేటి కరుణాకర్ ఆధ్వర్యంలో చిన్నారులు చేసిన నృత్యాలు చూపర్లను అలరించారు. శ్రీ వైష్ణవి కళాశాలల డైరెక్టర్లు మాచిబట్టు సుబ్బరాజు, ఒంగోలు శ్రీనివాసాచారి, దేగల శ్రీనివాస రావు, ఉప్పు సోమేశ్వరరావు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సంబరాల్లో కళాశాలల బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## అంగరంగవైభవంగా గీతాంజలి సిల్వర్ జూబ్లీ వేడుకలు

### 25ఏళ్ల నాటి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వినుకొండ,జనవరి10,ప్రభాతవార్త: స్థానిక గీతాంజలి స్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు పురస్కరించుకొని 25 సంవత్సరాల పూర్వ విద్యార్థులతో గొప్ప ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గత 25 సంవత్సరాలుగా గీతాంజలి పాఠశాల నందు విద్యను అభ్యసించిన విద్యార్థులు హాజరై వారి యొక్క చిన్ననాటి స్మృతులను నెమరు వేసుకున్నారు. వీరిలో ఎంతోమంది



డాక్టర్లు,ఇంజనీర్లుగా స్థిరపడ్డారు. విదేశాలలో ఉన్న ఎందరో విద్యార్థులు వేడుకలకు హాజరు కాలేకపోయినా అందుబాటులో ఉన్న అనేకమంది విద్యార్థులు హాజరై తమ టీచర్స్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఎంతో ఆనందంగా గడిపారు. గీతాంజలి స్కూల్ మొదటి బ్యాచ్



విద్యార్థి జి.శివ, శ్రీనివాసరెడ్డి గుంటూరులోని హృదయాలయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నందు ప్రముఖ కార్డియాలజిస్ట్‌గా పని చేస్తున్నారు. అలాగే ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగారు. వారి అనుభవాలను తోటి మిత్రులు,ఉపాధ్యాయులతో పంచుకున్నారు. కార్యక్రమంలో గీతాంజలి వ్యవస్థాపకులు వై.శేషగిరిరావు,కరెస్పాండెంట్ కిషోర్,ఉపాధ్యాయులు,విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఈపూరు గ్రామంలో 'కేర్' కార్యక్రమం

ఈపూరు,జనవరి10,ప్రభాతవార్త: ఈపూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఈపూరు గ్రామం నందు కేర్ (కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్) ప్రోగ్రాం శనివారం నిర్వహించారు.



డ్రగ్స్,ఆల్కహాల్ వల్ల సంభవించే దుష్పలితాలు పట్ల గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నాటుసారాయి,గంజాయి తదితర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కేర్ ప్రోగ్రాం ప్రతి నెల రెండో శనివారం,నాల్గవ శనివారం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎక్సైజు సంబంధిత నేరాల గురించి సమాచారం ఉంటే తమకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈపూరు ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎంపి శ్రీకృష్ణదేవరాయలుకు పొగాకు రైతుల వినతి

వినుకొండ,జనవరి10,ప్రభాతవార్త: సిగరెట్లపై ప్రభుత్వం పెంచిన జీఎస్టీని తగ్గించి పొగాకు రైతులను ఆదుకోవాలని కోరుతూ వినుకొండ ప్రాంత రైతులు నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలను గుంటూరులోని నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. పార్లమెంట్‌లో పొగాకు



రైతుల వాణి వినిపించి పెంచిన జీఎస్టీ ని ప్రభుత్వం తగ్గించే విధంగా కృషి చేయాలని కోరారు. పొగాకు రైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి గిట్టుబాటు ధరకు నష్టం లేకుండా చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తానని ఎంపీ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ముసికర శ్రీనివాసరెడ్డి,పలు గ్రామాలకు చెందిన పొగాకు రైతులు పాల్గొన్నారు.

## పెదకంచర్ల గ్రామీణ కళాపరిషత్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

వినుకొండ,జనవరి10,ప్రభాతవార్త: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని పెదకంచర్ల గ్రామం నందు పెదకంచర్ల గ్రామీణ కళా పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 13,14,15,16 తేదిల్లో నాటకోత్సవాలు,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పెదకంచర్ల గ్రామీణ కళా పరిషత్ కార్యవర్గ సభ్యులు,గ్రామపెద్దలు తెలియజేశారు. కార్యక్రమ వివరాలు ఇలా 13వ తేది రాత్రి 7గంటలకు అమృతపూడి దివ్యశ్రీ శిష్యబృందం వినుకొండ వారిచే నృత్యప్రదర్శనలు,8గంటలకు ఉషోదయ కళానికేతన్,కాత్రపాడు వారి మంచిమనసులు నాటిక,9గంటలకు పెదకంచర్ల బాలలకు డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తారు. 14వ తేది రాత్రి 7గంటలకు గుడిపూడి అంకారావు శిష్యబృందం ఏనుగుపాలెం వారిచే కోలాటం,8గంటలకు గోవాడ క్రియేషన్ హైదరాబాద్ వారి అమ్మచెక్కినబొమ్మ నాటిక,9గంటలకు బాలలకు డ్యాన్స్ పోటీలు ఉంటాయి. 15వ తేది రాత్రి 7గంటలకు కొలకలూరి వారి జనరల్ బోగీలు నాటిక,8గంటలకు ముత్తినేని క్రియేషన్ పెదకంచర్ల వారి పౌరాణిక నాటిక మహావీరకర్ణ,9గంటలకు విజయవాడ వారి మమ్మల్ని బ్రతకనివ్వండి నాటిక,16న గుంటూరు వారి ఇంద్రప్రస్థం,కాకినాడ వారి కన్నీటికి విలువెంత నాటిక ప్రదర్శనలు జరుగుతుందని పేర్కొన్నారు.

## చంద్రబాబును కలిసిన 'బండారు' బృందం



సత్తెనపల్లి, జనవరి 10, ప్రభాతవార్త: టిడిపి జాతీయ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి సత్తెనపల్లి నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు. సత్తెనపల్లి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు బండారు నాగరాజు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు చిలకా చంటి, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి బొజ్జ కాంతారావు, ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెలిసేల వెంకట్రావు తదితరులున్నారు.

## కార్యకర్తలే మా పార్టీ బలం..



యడ్లపాడు, జనవరి 10, ప్రభాతవార్త : గ్రామ స్థాయి కమిటీల ఏర్పాటులో భాగంగా ఎడ్లపాడు మండలంలోని కొత్తపాలెం, కొండవీడు, కోట గ్రామాలలో పార్టీ శ్రేణులతో ఆమె పర్యటించారు. పార్టీ శ్రేణులు తమ గ్రామానికి వచ్చిన మాజీ మంత్రి రజిని ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మూడు గ్రామాలలో కొత్త కమిటీలను ఏర్పాటు చేసి అనంతరం ఆయా గ్రామాలలో ఆమె ప్రసంగించారు. పార్టీ గ్రామ కమిటీల నియామక కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహించి, గ్రామస్థాయిలో వారికి దిశానిర్దేశం చేశారు. ఆయా గ్రామాలలో నాయకులు కార్యకర్తలతో చర్చించి కమిటీలను ఏకగ్రీవం చేసి ప్రకటించారు. వైయస్సార్సీపి యడ్లపాడు మండలం అధ్యక్షులు వద్దేపల్లి నరసింహారాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మద్దూరి కోటిరెడ్డి రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి ఎం వి బాలచంద్రారెడ్డి, నాయకులు పందుల బుల్లబ్బాయి, ఉదయ్ కిరణ్, షేక్ గౌస్ సందాని, పెదబాబు, సనావుల్లా, రెహమాన్, షేక్ జాకీర్, యూనిస్, వెంకట్రావు, జయరావు, బాజీ, మానం సాంబయ్య పాతబోయిన కోటయ్య , మాధవరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ సోషల్ మీడియాపై ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి ధ్వజం



మాచర్ల, జనవరి 10 ప్రభాతవార్త: సర్వతోముఖాభివృద్ధి వైపు నియోజకవర్గం పరుగులు పెడుతున్న వేళ రాజకీయంగా కుట్ర పన్ని అడ్డుకోవాలని చూస్తే తోలుతీస్తామని వైసీపీ సోషల్ మీడియా మూకలను ఉద్దేశించి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారంర పట్టణంలో పలు అభివృద్ధి పనులు పట్టాలెక్కిన తరుణంలో వాటిని పరిశీలించిన ఆయన మీడియాతో మాట్లాడారు. శ్రీపొట్టి శ్రీరాములు జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.1200 కోట్లతో భారీ వాటర్ గ్రిడ్‌ను నెలకొల్పి, నియోజకవర్గ వ్యాప్తంగా అందరికీ మరో ఏడాదిలో తాగునీరు అందించబోతున్నామని చెప్పారు. ఇప్పటికే గ్రామాల్లో పెద్దఎత్తున వాటర్ పైపులు అందుబాటులోకి వచ్చాయని, ఆ అభివృద్ధిని చూసి వైసీపీ నేతలు హడలిపోతున్నారని ఎద్దేవా చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న మౌలిక వసతుల అభివృద్ధిని చూసి, వైసీపీ నేతలకు నిద్రపట్టడం లేదని విమర్శించారు. ఆనాడు ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం చంద్రబాబు కుప్పంతో సమానంగా మాచర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు.

**అరాచక శక్తులకు అభివృద్ధితోనే సమాధానం!**

వైసీపీ ప్రత్యేక రాజ్యాంగం అంటూ మూకలు సోషల్ మీడియాలో చేస్తున్న రాద్ధాంతం అంతా అరాచకం, దోపిడీ, దౌర్జన్యాలు, శవ రాజకీయాలతో ముడిపడి ఉంటాయని ఎమ్మెల్యే జూలకంటి విమర్శించారు. అలాంటి అరాచక శక్తులకు అభివృద్ధితోనే సమాధానం చెప్తామన్నారు. టీడీపీ సోషల్ మీడియా చూస్తే అంతా అభివృద్ధి, సంక్షేమమే ఉంటుందన్నారు. ప్రజలు 11 సీట్లు ఇచ్చి జగన్‌ను ఇంట్లో కూర్చోబెట్టినా ఇంకా సిగ్గు రాలేదన్నారు. జగన్ అండ్‌కో దళితులను ఊచకోత కోస్తే.. కూటమి ప్రభుత్వం హయాంతో చంద్రబాబు వారిని హక్కున చేర్చుకుంటూ ఆదుకుంటున్నారన్నారు. దళిత మేధావి సుధాకర్ కుటుంబానికి నష్టపరిహారం ప్రకటించి, ఆయన కుమారుడికి ఉద్యోగం ఇవ్వడం పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసీపీ ఎంత దుష్ప్రచారం చేసినా...

## మధుబాబుతో చెలిమి చెదరనిది: 'జూలకంటి'

మాచర్ల, జనవరి 10 ప్రభాతవార్త: వైసీపీ పేటీఎం బ్యాచ్ ఎంత విష ప్రచారం చేసినా తనకు చిరుమామిళ్ల మధుబాబుతో ఉన్న చెలిమి చెదరనిదని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తేల్చి చెప్పారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాజకీయంగా తనను తట్టుకోలేకపోతున్న తరుణంలో నియోజకవర్గంలో చిరుమామిళ్ల యాక్టివ్ అవ్వడం జీర్ణించుకోలేక బ్లూమీడియా, బులుగు బ్యాచ్ తప్పు వదంతులను వండివారుస్తున్నారని క్లారిటీ ఇచ్చారు. రాజకీయంగా కష్టపడి, నష్టపోయిన వ్యక్తి చిరుమామిళ్ల మధుబాబు అని, ఆయనకు పార్టీలో, ప్రభుత్వంలో మంచిస్థానం కల్పించాలని గతంలోనే సిఫార్సు లేఖను సీఎం చంద్రబాబుకు అందజేశానన్నారు. పార్టీకి ఆయన అందించిన సేవలను గుర్తించి ఆయనకు పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ పదవిని అందించిందని చెప్పారు. ఎవరు ఎంత కష్టపడినా టీడీపీ ఉన్నతి కోసమేనని, జెండాకోసం అందరూ పాటుపడాల్సిందేనని వివరించారు. ఇప్పటికైనా లేనిపోని దుష్ప్రచారాలు మానుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

## పల్నాడు జూనియర్ కాలేజీలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

మాచర్ల, జనవరి 10 ప్రభాతవార్త: పల్నాడు జూనియర్ కాలేజీలో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకగా ముత్యాల రంగవల్లులు, కోలాటాలు, గాలిపటాల ఎగురవేసే కార్యక్రమాలు, భోగి మంటలు వంటి అనేక సంప్రదాయమైన సంక్రాంతి వేడుక కార్యక్రమాలను





నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ కొండవీటి రామకోటయ్య మాట్లాడుతూ తెలుగింటి వాకిళ్లలో జరుపుకునే ఘనమైన సంక్రాంతి వేడుకలు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను నేటితరం విద్యార్థులకు తెలుపుతూ నిర్వహించిన కాలేజీ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పఠాన్ నాగూర్‌వలి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రిన్సిపల్ నూతలపాటి శివభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## వాణి విద్యానికేతన్‌లో సంక్రాంతి సంబరాలు

మాచర్ల, జనవరి 10 ప్రభాతవార్త: స్థానిక వాణీ విద్యానికేతన్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. పండుగలు సంస్కృతికి, సంప్రదాయాలకు నిలయాలని, అలాంటి



పండుగలో తెలుగువారి అతిపెద్ద పండుగ సంక్రాంతి అని ప్రిన్సిపల్ కె.వి.రమణ అన్నారు. డైరెక్టర్ అంజనీ మాట్లాడుతూ ప్రకృతి పరంగా కాలగమనం దక్షిణ యానం నుంచి ఉత్తరాయణం వరకు పయనిస్తూ సూర్యుడు మకరరాశిలో ప్రవేశించి నూతన కాంతులు అందించే నవ ఉషస్సులను నింపుతోందని తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో ముగ్గుల తోరణాలు, విద్యార్థుల భోగిమంటలు సందడి చేశాయి. చిన్నారుల భోగిపండ్ల వేడుకలు, బొమ్మల కొలువు, హరిదాసులు, గంగిరెద్దులు, చీరకట్టు, పంచెకట్టులతో చిన్నారులు సంప్రదాయ వేషధారణలో కలియతిరిగారు. ముగ్గుల పోటీల ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## ఏడాదిలో ఇంటింటికీ రక్షిత మంచినీరు: ఎమ్మెల్యే 'జూలకంటి'

వెల్దుర్తి, జనవరి 10 ప్రభాతవార్త: మాచర్ల నియోజకవర్గ ప్రజల దశాబ్దాల తాగునీటి కష్టాలను తీర్చడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం వెల్దుర్తి మండల పరిధిలోని మండాది, బోదిలవీడు రోడ్డులో జల్‌జీవన్ మిషన్ ద్వారా చేపడుతున్న తాగునీటి పైపులైను పనులకు ఆయన భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాపనంగా రూ.800 కోట్లతో జల్‌జీవన్ మిషన్ వాటర్ గ్రిడ్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి స్వచ్ఛమైన రక్షిత తాగునీటిని అందించడమే లక్ష్యమన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలకు పెద్దఎత్తున పైపులు చేరుకున్నాయని, వాటిని భూమిలో అమర్చే ప్రక్రియ మొదలైందన్నారు. వచ్చే ఏడాది కాలంలోనే పనులన్నీ పూర్తిచేసి ప్రజలందరికీ కుళాయిల ద్వారా నీరు అందిస్తామని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సాగునీరు, తాగునీరు, మౌలిక వసతుల కల్పనలో ఎక్కడా రాజీ పడకుండా నిధులు కేటాయిస్తుందని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం: ఎమ్మెల్యే



వెల్దుర్తి, జనవరి 10 ప్రభాతవార్త: ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించారు. భూ వివాదాలు, రెవెన్యూ సమస్యలు, నూతన పింఛన్ల మంజూరు వంటి అనేక సమస్యలపై ప్రజలు అర్జీల రూపంలో సమస్యను ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనిపై స్పందించిన ఆయన తక్షణమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మార్చి 15 నాటికి నిధుల సద్వినియోగం చేయాలి: ఎమ్మెల్యే

వెల్దుర్తి, జనవరి 10 ప్రభాతవార్త: మాచర్ల నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి మంజూరవుతున్న గ్రాంటు నిధులను నిర్దేశిత గడువులోగా వినియోగించాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం వెల్దుర్తిలోని క్యాంపు కార్యాలయంలో



అయిదు మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది 15 నాటికి మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకుని, పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. పంచాయతీరాజ్, ఎన్ఆర్జీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల పనితీరును సమీక్షించారు. ముఖ్యంగా జల్‌జీవన్ మిషన్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలల కాలానికి గాను దాదాపు రూ.20 కోట్ల నిధులను ఇతర అభివృద్ధి పనులకు కేటాయించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పనులను గుర్తించి, నిధులు వృథా కాకుండా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ఏఈలు, ఇతర సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో వెల్దుర్తితోపాటు ఇతర మండలాల ఏఈలు, పంచాయతీరాజ్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నీరు , నాగరికతల అవినాభావ సంబంధంపై కనీస స్పృహ లేని అజ్ఞాని జగన్: ప్రత్తిపాటి

చిలకలూరిపేట,జనవరి 10, ప్రభాతవార్త: మాజీ సిఎం జగన్ రాజధాని రైతుల ఊసెత్తడం ముమ్మాటికీ కుట్ర రాజకీయమే అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పేర్కొన్నారు. "భూసేకరణ ముసుగులో



అమరావతిపై జగన్, వైసీపీ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఆ పార్టీ నిలకడలేమికి, అస్థిత్వం, అవగాహనా రాహిత్యానికి నిదర్శనమన్నారు. దేశంలో ఒక సిద్ధాంతం, నీతినియమం లేని పార్టీ వైసీపీ ఒక్కటే. ప్రజాక్షేమం కోరే పార్టీలు ఎల్లప్పుడూ నిబద్ధతతో కూడిన నియమావళి, క్రమశిక్షణతో కూడిన భావజాలం అన్నారు. ప్రజాహితంతో నిండిన సిద్ధాంతాల ప్రాతిపదికనే రాజకీయాలు చేస్తుంటాయి. అందుకు విరుద్ధంగా జగన్ పార్టీ వ్యవహరిస్తోందన్నారు. గాలివాటుగా ఎప్పటికప్పుడు, అవసరాలకు అనుగుణంగా రంగులు, వేషాలు మారుస్తూ, ప్రజల భావోద్వేగాలతో ఆటలాడుతున్న పార్టీ వైసీపీ. ఐదేళ్ల పాలనలో ప్రజారాజధానిని ప్రపంచపటంలో లేకుండా ప్రయత్నించిన, భూములిచ్చిన రైతుల, మహిళలపై దారుణంగా దమనకాండకు పాల్పడిన జగన్, వైసీపీప్రభుత్వం నేడు రైతుల ఊసెత్తడం.. ముమ్మాటికీ కుట్ర రాజకీయమే. నీటికి, నాగరితకు అవినాభావ సంబంధం ఉంటుందనే కనీస స్పృహ లేని వారు రాష్ట్రంలో రాజకీయ నాయకులుగా చలామణి కావడం నిజంగా సిగ్గుపడాల్సి న అంశం.అని ప్రత్తిపాటి పేర్కొన్నారు. తానే జ్ఞానిని, అపర మేథావినని నిస్సిగ్గుగా, సమర్థించుకుంటూ తన బుద్ధి, బుర్రలేని చేష్టలు, మాటలు ప్రజలూ చూడటం ఆయన అవివేకానికి, ఆత్మన్యూనతాభావానికి పరాకాష్ట." అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## 'ఈ-పంట' కార్యక్రమంపై పరిశీలన

చిలకలూరిపేట,జనవరి 10, ప్రభాతవార్త: చిలకలూరిపేట మండలంలోని వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న ఈ పంట కార్యక్రమాన్ని సమీక్షిం చుటకు పర్యవేక్షణ అధికారిగా నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు కెవి శ్రీనివాసరావు మండలంలోని మానకొండావారి పాలెం గ్రామంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించి ఈ పంట కార్యక్రమం ఎలా సాగుతుంది అనే దానిపై గ్రామ వ్యవసాయ సహాయకుడు శ్రీనివాసరావుని అడిగి తెలుసుకుని రైతులతో సమీక్షించటం జరిగినది. వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్ ప్రవీణ్, గ్రామ వ్యవసాయ సహాయకులు కె. శ్రీనివాసరావు, పి. హనుమంతరావు, పలు రైతులు పాల్గొన్నారు.



## రామకృష్ణ మృతికి మునిసిపల్ సిబ్బంది సంతాపం



చిలకలూరిపేట,జనవరి 10, ప్రభాతవార్త: చిలకలూరిపేట మున్సిపాలిటీలో కంప్యూటర్ ఆపరేటర్ రామకృష్ణ మృతిచెందారు. చిలకలూరిపేట పురపాలక సంఘం ఇంజనీరింగ్ విభాగంలో అవుట్సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. .రామకృష్ణ మృతి పట్ల మున్సిపల్ కార్యాలయ సిబ్బంది మరియు తోటి ఉద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

## పట్టణ టిడిపి ముస్లిం మైనారిటీ కార్యవర్గం ఏకగ్రీవం

చిలకలూరిపేట,జనవరి 10, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణ తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనారిటీ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా పార్టీ పట్టణ స్థాయి కార్యవర్గాల ఎన్నిక ప్రక్రియలో భాగంగా పార్టీ శ్రేణులు ఎన్నుకోవటం జరిగింది. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సంస్థాగత ఎన్నికలో భాగంగా చిలకలూరిపేట పట్టణ ముస్లిం మైనారిటీ కార్యవర్గాన్ని పార్టీ శ్రేణులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. చిలకలూరిపేట పట్టణ తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనారిటీ కమిటీ అధ్యక్షులుగా షేక్ కరీం గారు, ప్రధాన కార్యదర్శిగా షేక్ సుభాని( చోటు )గారు మరియు ఉపాధ్యక్షులు గా షేక్ జానీ భాషా గారు, షేక్ ఖాజా మొహిద్దీన్ గారు లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిక కాబడిన నేతలు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన మాజీ మంత్రి వర్యులు, స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గారికి తమ ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నిక కార్యక్రమంలో నెల్లూరి సదాశివ రావు గారు, షేక్ కరిముల్లా గారు, పఠాన్ సమద్ ఖాన్ గారు, మద్దుమాల రవి గారు తదితరులు పాల్గొనడం జరిగినది.



## ఉపాధ్యాయులు,ఉద్యోగులకు సంక్రాంతి కానుకగా పిఆర్సీ కమిటీ,మధ్యంతర భృతి ప్రకటించాలి. ఎస్టీయు

చిలకలూరిపేట,జనవరి 10, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉపాధ్యాయులకు సంక్రాంతి పండగ కానుక గా పి ఆర్సీ నియామకం చేసి 30 మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్టియు రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కే కోటేశ్వరరావు రాష్ట్ర డైరీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు కోరారు. 2024జూలై నుండి నాలుగు డి ఏ లు ప్రకటించాల్సి ఉండి కావున రెండు డి ఏ లైనా ప్రకటించాలని కోరారు, గత ప్రభుత్వం పీఆర్సి బకాయిలు,డి.ఏ బకాయిలు పెండింగ్లో ఉంచిందని ఆ బకాయిలు విడుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కోరుతుందని తెలిపారు చిలకలూరిపేట పట్టణంలోని ఎస్ టి యు ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఉపాధ్యాయులపై యాప్ ల ఒత్తిడి భారం తగ్గించాలని, అసెస్మెంట్ బుక్ విధానం రద్దు చేయాలని కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్ ప్రారంభించాలని కోరారు.12వ పి ఆర్ సి కమిషనర్ ని నియమించాలని ఆలస్యం అయ్యే నేపథ్యంలో30 మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. ఉద్యోగులు ఉపాధ్యాయ సంఘాల తో రాష్ట్ర ముఖ్యమంత్రి సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలు చర్చించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నిర్మాణం వార్షిక కౌన్సిల్ నిర్వహణ,గురించి చర్చించడం జరిగింది ఈ సమావేశంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు బొంత రవి, ఉపాధ్యక్షులు యం, శారద, రాష్ట్ర కౌన్సిలర్ విజయ్ కుమార్ పట్టణ అధ్యక్షులు మేకల కోటేశ్వరరావు వడ్డాన జయప్రకాష్, నాదెండ్ల మండల అధ్యక్షులు షేక్ మక్బూల్ బాషా ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ చిలకలూరిపేట మండల అధ్యక్షులుషేక్ మస్తాన్ వలి కార్యదర్శి వి రమణా నాయక్ యడ్లపాడు మండల అధ్యక్షులు జి కోటేశ్వరరావు ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ ఎస్ టి యు సీనియర్ నాయకులు చావల మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



## సాయి వికాస్ లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

చిలకలూరిపేట,జనవరి 10, ప్రభాతవార్త:స్థానిక సుబ్బయ్య తోటలోని సాయి వికాస్ స్కూల్ నందు సంక్రాంతి సంబరాలు అత్యంత వైభవంగా జరిగాయి. పాఠశాలలో వైభవంగా జరిగిన ఈ



కార్యక్రమాలలో విద్యార్థి విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పాఠశాల డైరెక్టర్ ఎన్ వీరస్వామి, ప్రిన్సిపల్ ఈ. శ్రీకాంత్, ఏ. వో సుభాని మరియు పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగినది.

## చైతన్య ఎలైట్ స్కూల్లో వింటర్ రోబోటిక్ లీగ్ 2026

చిలకలూరిపేట,జనవరి 10, ప్రభాతవార్త: చైతన్య ఎలైట్ స్కూల్లో వింటర్ రోబోటిక్ లీగ్ 2026 ప్రోగ్రామ్ ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు , జేఎన్టీయూ కాకినాడ ఉపకులపతి సీఎస్ఆర్ కె ప్రసాద్ సందర్శించారు. విద్యార్థులు ఎంతో సృజనాత్మకతతో ప్రదర్శించిన ఆవిష్కరణలను చూస్తే సంతోషంగా అనిపించింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఒక టీంతో స్పిరిట్ తో పని చేశారు కాబట్టి ఇలాంటి ఆవిష్కరణల ప్రదర్శన సాధ్యం అయ్యింది.



విద్యార్థులు కేవలం చదువే కాదు, ఇలాంటి పోటీలు, ఆవిష్కరణల ప్రదర్శనలు, స్పోర్ట్స్ పోటీల్లో పాల్గొన్నప్పుడే ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా జ్ఞాన సముపార్జన సాధ్యమవుతుంది. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను నాలుగు గోడల్లో బంధించకుండా బయట ప్రపంచంలో పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలి. గతంలో పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానం వస్తుంటే, ప్రస్తుతం సాంకేతిక రంగం ఎంతో అభివృద్ధి జరిగి ఆన్లైన్లో చిన్న మెసేజ్ ద్వారా సమాచారం అందుతున్నది, ఈ అవకాశాలను అందిపుచ్చుకొని ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించటం జరిగింది. ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించిన ఈదర గిరీష్ ని అభినందించారు

# పల్నాడు జిల్లా వార్త



## స్వచ్ఛ సంక్రాంతితో స్వచ్ఛ నరసరావుపేట సాధిద్దాం: ఎమ్మెల్యే డా.చదలవాడ



నరసరావుపేట,జనవరి 10 ప్రభాతవార్త ::స్వచ్ఛతే ఆరోగ్యానికి మూలమని చాటేలా స్వచ్ఛ సంక్రాంతిస్వచ్ఛ నరసరావుపేట కార్యక్రమం ద్వారా స్వచ్ఛ నరసరావుపేటను సాధిద్దామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు.శనివారం నరసరావుపేట పట్టణ సమీపం లోని శ్రీనివాస గిరిజన కాలనీలో పారిశుద్ధ్య పనులను పరిశీలించడంతో పాటు పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కాలనీలో రోడ్లపై ఉన్న చెత్తను తొలగించి, మురుగు కాల్వలలో పూడికతీత పనులలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పండుగలు కేవలం ఆనందానికి మాత్రమే కాకుండా పరిసరాల పరిశుభ్రతకు కూడా ప్రేరణ కావాలన్నారు. తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన స్వచ్ఛ కార్యక్రమాల్లో భాగంగా స్వచ్ఛ నరసరావుపేట సాధించడమే లక్ష్యమన్నారు. ముఖ్యంగా గిరిజన కాలనీలు, పేద ప్రజలు నివసించే ప్రాంతాల్లో పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కార్మికులకు సూచించారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలను కొనియాడారు. పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం, భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజలంతా చెత్తను రహదారులపై వేయకుండా కార్మికులకు సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు కోరారు . కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ లకిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, డాక్టర్ రాంప్రసాద్ పార్టీ నాయకులు క్రాంతి కుమార్, ఆలూరి అజయ్ కుమార్, స్థానిక కార్యకర్తలు ఉన్నారు.

## కోటప్పకొండ అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



నరసరావుపేట, జనవరి10 ప్రభాతవార్త ::సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరిం చుకుని కోటప్పకొండకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శనివారం పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. వచ్చే నెల 15 న మహాశివరాత్రి రోజున కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. భక్తుల క్యూ లైన్లు, ప్రసాదాల తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రసాదాల తయారీలో నాణ్యత, పరిశుభ్రత, భక్తులకు సమయానికి సరఫరా అంశాలపై పలు సూచనలు చేశారు. భక్తుల ఆరోగ్యం దృష్ట్యా శుభ్రతా ప్రమాణాలను పాటించాలన్నారు. తిరునాళ్ల అభివృద్ధి పనులపై సమీక్షించేందుకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి త్వరలో కోటప్పకొండ రానున్నట్లు తెలిపారు. కోటప్పకొండను ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.గత ఏడాది తిరునాళ్ల కు 25 లక్షల మంది భక్తులు హాజరయ్యారని ఎటువంటి లోపాలు లేకుండా విజయవంతంగా నిర్వహించామని ఈ ఏడాది కూడా భక్తుల రద్దీ దృష్ట్యా తాగునీరు, పారిశుద్ధం, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఆదేశించారు. నరసరావుపేట పట్టణానికి చెందిన ఈదర సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించిన భక్త రంజని కార్యక్రమం భక్తులను అలరించింది. అనంతరం కోటప్పకొండపై పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఇఓ డి.చంద్రశేఖర్, నాగసరపు సుబ్బరాయ గుప్తా, మన్నన్ షరీఫ్, మడకా ప్రసాద్, హరికృష్ణ, లింగాల వీరప్పయ్య, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎపి అండర్15 చెస్ టోర్నమెంట్ 2026 ప్రారంభం

నకరికల్లు, జనవరి 10 ప్రభాతవార్త ::స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఆంధ్ర చెస్ అసోసియేషన్ తరపున అండర్ 15 చెస్ టోర్నమెంట్ ప్రారంభం జరిగింది. శనివారం ఈ టోర్నమెంట్లో 170 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. టోర్నమెంటును ద్రోణాచార్య అవార్డు గ్రహీత, కోనేరు హంపి తండ్రిగారైన కోనేరు అశోక్ ప్రారంభించారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు మరియు ఫైడ్ ఇన్స్ట్రక్టర్ చల్లా రవీంద్ర రాజు, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎండి వివి నర్సయ్య , స్కూల్ చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్ , డైరెక్టర్ నాగోతు సబిత, సీనియర్ కోచ్ మురళీకృష్ణ, ఖాసిం , సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



## పల్నాడులో వైకాపా సంస్థాగత నిర్మాణం

నరసరావుపేట,జనవరి 10 ప్రభాతవార్త ::వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లాస్థాయి పార్టీ సంస్థాగత నిర్మాణ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమానికి సంబంధించి నరసరావుపేటలోని పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా పార్లమెంటరీ పరిశీలకులు పూనూరు గౌతమ్ రెడ్డి, పల్నాడు జిల్లా టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు టీ జె సుధాకర్ బాబు, రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ కందుల రవీంద్రారెడ్డి, పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి , మాజీ మంత్రివర్యులు చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త విడుదల రజని పాల్గొన్నారు. వారితో పాటు పెదకూరపాడునియోజకవర్గ సమన్వయకర్త నంబూరి శంకర్రావు, సత్తనపల్లి నియోజకవర్గం గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి , జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు రాష్ట్ర, జిల్లా ఉపాధ్యక్షులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా సంసాగత కమిటీల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు పార్టీ చేపట్టిన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నా రు. జిల్లాలోని అన్ని గ్రామాలు వార్డులలో పార్టీ సంస్థాగత కమిటీల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని,తద్వారా పార్టీని బలోపేతం చేయాలనిచేయాలని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు.



## ఎంఏఎం ఫార్మసీలో సంక్రాంతి సంబరాలు

నరసరావుపేట,జనవరి 10 ప్రభాతవార్త :: ఎంఏఎం కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో జనవరి 9, 10 తేదీలలో కళాశాల ప్రాంగణంలో సంప్రదాయబద్ధంగా "సంక్రాంతి సంబరాలు" అట్టహాసంగా నిర్వహించబడ్డాయి. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయడం, గ్రామీణ పండుగల ప్రాముఖ్యతను తెలియజేయడం ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహించడ్డాయి. కార్యక్రమానికి కళాశాల చైర్మన్ శ్రీ ఎం.ఆర్. శేషగిరిరావు, ప్రిన్సిపల్ డా. ఎం. ప్రసాదరావు, డైరెక్టర్ శ్రీమతి డి. శ్రావ్య పృథ్విరాజ్ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ప్రకృతి, వ్యవసాయం మరియు మానవ సంబంధాల మధ్య ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తుందని, ఇటువంటి సంప్రదాయ పండుగలను కళాశాల స్థాయిలో నిర్వహించడం ఎంతో అభినందనీయమని అన్నారు.సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగి మంటలు, బొమ్మల కొలువు, కబడ్డీ పోటీలు వంటి అనేక సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. క్రీడా కార్యక్రమాలలో భాగంగా నిర్వహించిన కబడ్డీ పోటీలు విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించాయి. పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. గెలుపొందిన జట్లకు కళాశాల యాజమాన్యం తరఫున అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంక్రాంతి పండుగను కుటుంబ వాతావరణంలో జరుపుకున్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా. ఎం. ప్రసాదరావు గారు మాట్లాడుతూ, విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వడం ఎం ఎ యం కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రత్యేకత అని తెలిపారు. డైరెక్టర్ డి. శ్రావ్య మేడం విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలు పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.



## ప్రమాదంలో గాయపడిన సుబ్బారావుకు 'మర్రి' పరామర్శ



యడ్లపాడు, జనవరి 10, ప్రభాతవార్త : యడ్లపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ముత్తవరపు సుబ్బారావు కొద్ది రోజుల క్రితం ఇంటి వద్ద జరిగిన చిన్న ప్రమాదంలో కాలు, చెయ్యి దెబ్బతినగా వాటికి శస్త్ర చికిత్స చేయించుకుని, ఇంటికి చేరుకున్నారని తెలుసుకొని వారిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిచారు శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్. ఈ కార్యక్రమంలో వారి వెంట వారి అనుచరులు కల్లూరి బుజ్జి, కల్లూరి రామకృష్ణ,తెలుగుదేశం పార్టీ నాయకులు గోనుగుంట్ల శ్రీధర్ ,గోనుగుంట్ల సుబ్బారావు, సిపిఎం నాయకులు ముత్తవరపు పద్మారావు, కొమ్మినేని కోటయ్య,దొప్పలపూడి హరిబాబు తదితరులున్నారు.

## మట్టి కుస్తీ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థికి 'ప్రత్తిపాటి' అభినందన



యడ్లపాడు, జనవరి 10, ప్రభాతవార్త : ఇటీవల జరిగిన బీచ్ గ్రాప్లింగ్ ( మట్టి కుస్తీ ) పోటీలలో రాష్ట్ర స్థాయిలో బంగారు మెడల్ ని, నేషనల్ స్థాయిలో సిల్వర్ మెడల్ ని సాధించిన మండల పరిధిలోని వంకాయలపాడు సమీపంలోని డాక్టర్ బిఆర్ అంబెద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి ఆర్. శివ మల్లికార్జున్ ను అభినందించారు మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ బీచ్ గ్రాప్లింగ్ పోటీలలో రాష్ట్రం నుంచి నేషనల్ లెవెల్ పోటీలలో అండర్ 17లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనపర్చి సిల్వర్ మెడల్ సాధించిన మల్లికార్జున్, మార్చి నెలలో థాయిలాండ్ లో జరిగే ఇంటర్నేషనల్ పోటీలలో పాల్గొనడం సంతోషంగా ఉందని, ఇంక అనేక పోటీలలో పాల్గొని, దేశం గౌరవాన్ని పెంచాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకరరావు, మండ టీడీపీ అధ్యక్షుడు కామినేని సాయిబాబు పాల్గొన్నారు.

## పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ పూర్తి కావాలి :ఆర్డీఓ



యడ్లపాడు, జనవరి 10, ప్రభాతవార్త : మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాలలో ప్రభుత్వం అందజేస్తున్న నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ అధివారం సాయంత్రం కల్లా పూర్తిచేయాలని డివిజనల్ అర్డివో మధులత అదేశించారు. మండల పరిధిలోని జాలాది గ్రామంలో నూతన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో డివిజనల్ ఆర్డిఓ మధులత శనివారం పాల్గొన్నారు. రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో పంపిణీ శాతం చాలా తక్కువగా ఉందని ఆదివారం సాయంత్రం కల్లా నూరు శాతం పంపిణీ జరగాలని అధికారులను ఆదేశించారు. అమెతోపాటు తహశీల్దార్ విజయశ్రీ, విఆర్వో బాషా తదితరుటు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే డా. గోపిరెడ్డి పరామర్శ

నరసరావుపేట క్రైమ్, జనవరి 10 ప్రభాతవార్త :: పట్నానికి చెందిన సీనియర్ జర్నలిస్టు నంద్యాల జగన్మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి శనివారం పరామర్శించారు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు నంద్యాల కోటిరెడ్డి మృతి బాధాకరమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కమ్యూనిస్టు పార్టీతో పాటు సమాజానికి వారు చేసిన సేవలను గుర్తు చేశారు. నేటి యువతకు వారి ఆదర్శాలు, ఆశయాలు అనుసరణీయమని పేర్కొన్నారు. కోటిరెడ్డి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. భగవంతుడు వారికి మనశ్శాంతిని ప్రసాదించాలని ఆకాంక్షించారు. వారి కుటుంబానికి తాము ఎప్పుడూ అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ, పట్టణ, మండల నాయకులు మూరబోయినశ్రీనివాసరావు,వాసు, యన్నాం రాధాకృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.



## సంక్రాంతి క్రికెట్ పోటీలను ప్రారంభించిన డాక్టర్ సాయి కృష్ణ

నకరికల్లు, జనవరి 10 ప్రభాతవార్త :: నందిగామ గ్రామంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ను ప్రముఖ వైద్యులు డాక్టర్ సింగరాజు సాయికృష్ణ ప్రారంభించారు. శనివారం టోర్నమెంట్ లో పాల్గొన్న క్రీడాకారులకు డా. సాయి కృష్ణ అభినందనలు



తెలిపారు. గెలుపు, ఓటమి సమానంగా స్వీకరించాలని క్రీడాకారులకు సూచించారు. తెలుగు వారికి అత్యంత పెద్ద పండుగ భావించే సంక్రాంతి రోజుల్లో గ్రామాలలో ఇటువంటి కార్యక్రమాలు జరగటం సంతోషం అన్నారు. క్రికెట్ ఆట ప్రపంచంలోనే అత్యంత ఆదరణ కలిపిన క్రీడ అ ని తెలిపారు. స్నేహపూరిత వాతావరణం పోటీలు నిర్వహించాలని నిర్వహణ కమిటీ సభ్యులకు సూచన చేశారు. టోర్నమెంట్ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు తన వంతు సహకారం అందిస్తానని డాక్టర్ సింగరాజు సాయి కృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అమరేశ్వరరావు,అచ్చయ్య, మార్కండేయులు, గోపాల్, శివప్రసాద్,మణికంఠ పాల్గొన్నారు.

# టిడ్కో గృహ సముదాయాల్లో 'మన ఇల్లు.. మన సంక్రాంతి'

### మూడురోజుల పాటు సంక్రాంతి సంబరాలు...

చిలకలూరిపేట,జనవరి 10, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం పల్లెల పండుగను ప్రతి ఊరు వాడ ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ఇచ్చిన ఆదేశాల మేరకు,మాజీమంత్రి స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సూచనలతో సంక్రాంతి సంబరాలను చిలకలూరిపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ నగర్ లో ఉన్న టిట్కో గృహ సముదాయాలలో మన ఇల్లు మన సంక్రాంతి కార్యక్రమాన్ని ప్రారంభించి తొలి రోజు మహిళలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు, ఈ



సందర్భంగా మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని మాట్లాడుతూ మూడు రోజుల పాటు సంక్రాంతి సంబరాలను అంగరంగ వైభవంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించటం జరుగుతుందని,తెలుగు సంప్రదాయం... పిండి వంటలు, నూతన వస్త్రాలు, పాడి పరిశ్రమ లు ,ధాన్య సిరులు వెరసి సంక్రాంతి పండుగ ని అన్నారు. మహిళలు ఎంతో ఉత్సాహంగా వివిధ రకాల ఆటల ఈ పోటీలలో పాల్గొన్నారు, రంగ వల్లులను మహిళలు అందంగా తీర్చి దిద్దారు.ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కరిముల్లా, జనసేన నియోజకవర్గ ఇంచార్జి రాజా రమేష్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు సమద్ ఖాన్ ,పలువురు ప్రముఖులు రాజకీయ నేతలు కూటమి నాయకులు పాల్గొన్నారు. సంక్రాంతి పండుగ విశిష్టత ని నేటి తరానికి అర్థం అయ్యేలా చేయడమే ఈ సంక్రాంతి సంబరాలు ముఖ్య ఉద్దేశమని వారు పేర్కొన్నారు.

# సంక్రాంతి సంబరాల పేరుతో కార్పొరేషన్ ఖజానాకు కన్నం

5వపేజీ తరువాయి

వసూలు చేసిన సొమ్మును ఎటువంటి సంబంధం లేని కార్మిక శాఖ స్థలంలో ఖర్చు చేయటమే కాకుండా పావు వంతు మాత్రమే మూడు వంతులు పైగా జేబులో నింపుకొనే కుట్ర జరుగుతుందని ఆరోపణలు వ్యక్తమోతున్నాయి. నియోజకవర్గంలో 90 శాతంపైగా ప్రాంతం మధ్యలో ఉన్న బ్రహ్మానంద రెడ్డి స్టేడియం ( బిఆర్ స్టేడియం ) లో ఎటువంటి ఖర్చు లేకుండా సంక్రాంతి సంబరాలు నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ ఒక పథకం ప్రకారం తూర్పు నియోజకవర్గంకు సంబంధించి కేవలం 10 శాతం ప్రాంతం మాత్రమే ఉన్న కార్మిక శాఖ స్థలంలో ఏర్పాటు చేయటంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇక్కడ పట్టుదలతో చేపడుతున్న సంక్రాంతి సంబరాలపై అవగాహన రాహిత్యం వల్ల చేస్తున్నారా... జేబులు నింపుకునేందుకే ఇక్కడ చేస్తున్నారా... లేదంటే కోట్ల రూపాయలు పనులు చేసి బిల్లులు డ్రా చేసుకున్నారు. ఒక పథకం ప్రకారం వాకింగ్ ట్రాక్ తో పాటు అక్కడ పెండింగ్ లో ఉన్న మిగతా కోట్ల రూపాయల పనులు దక్కించుకునేందుకు అంతా రింగై సంక్రాంతి సంబరాలను తెరపైకి తెచ్చారనే అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ముందు సంక్రాంతి సంబరాల పేరుతో స్థలం శుభ్రం చేయటం పనులకు రూ. 15 లక్షలు పైగా బిల్లులు డ్రా చేసేందుకు వ్యూహాన్ని రూపొందించుకున్నట్టు కార్పొరేషన్ అధికార వర్గాలలో చర్చి నియాంశంగా మారడం ఖి కొసమెరుపుఖి కార్మిక శాఖ స్థలంలో కార్పొరేషన్ నగదుతో పనులా...! గుంటూరు నగరంలోని బొంగరాల బీడు హిందూ స్మశాన వాటిక వెనుక ఉన్న వల్లూరి వారి నియోజకవర్గంలోనే బ్రహ్మానంద రెడ్డి స్టేడియం ఉన్న విషయాన్ని పాలకులు మర్చిపోయారా అని తూర్పు నియోజకవర్గ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తూర్పు నియోజకవర్గంలో కేవలం 10 శాతం మాత్రమే ఉన్న ప్రాంతమైన కార్మిక శాఖకు చెందిన స్థలంలో సంక్రాంతి సంబరాలు ఎలా నిర్వహిస్తారని, ఎందుకోసం నిర్వహిస్తున్నారో చెప్పాలని కోరుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ జేబులో నింపుకోవటానికి ఎటువంటి ముందస్తు ఆలోచన లేకుండా తమ సొంత నిర్ణయాలు చూసుకుంటున్నారని విమర్శిస్తున్నారు. ట్రాఫిక్ పద్మవ్యూహంలో గుంటూరు నగరం... గుంటూరు నగర ప్రజలు నిత్యం ట్రాఫిక్ సమస్యతో నరకం అనుభవిస్తున్నారు. ట్రాఫిక్ పద్మవ్యూహంలో గుంటూరు నగరం చిక్కుకుపోయిందని ఒకపక్క నగర ప్రజలు అల్లాడిపోతుంటే అవగాహన రాహిత్యంతో కార్మిక శాఖ స్థలంలో సంక్రాంతి సంబరాలు ఎలా నిర్వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికంగా ట్రాఫిక్ ఉండటం వల్ల లీటర్ల కొద్ది పెట్రోల్ తమ వాహనాలు తాగేస్తున్నాయని ఒక ప్రజలు అల్లాడిపోతుంటే సంక్రాంతి సంబరాలకు సంతోషంగా వెళ్లేందుకు దారి లేకుండా ఉన్న ప్రాంతంలో ఏ విధంగా పెట్టారో చెప్పాలని కోరుతున్నారు. ఒక్క 3వంతెనల ప్రాంతం తప్ప ఎటు దారి లేదని అటువైపుగా ఎలా వెళ్లాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ చూసినా అడ్డగోలుగా రోడ్లు తువ్వేశారని, బి ఆర్ స్టేడియం వంటి ప్రాంతాన్ని వదిలేసి ఎక్కడో పెట్టటం ఏమిటని ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. విజిలెన్స్ఖి విచారణ చేస్తే ఉద్యోగాలు పోతాయని అధికారుల వెన్నులో వణుకు...? కార్పొరేషన్ ను అడ్డాగా చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న అనేక సంఘటనలకు





తోటలోని కార్మిక శాఖ స్థలంలో కార్పొరేషన్ ఖజానా నుంచి ప్రజల పన్నులు రూపేనా కట్టిన సొమ్మును సంక్రాంతి సంబరాల పేరుతో వృధాగా ఖర్చు చేయడంపై అనేక విమర్శలకు తావిస్తోంది. కార్మిక శాఖ అధికారులు అధికారికంగా ఆ స్థలాన్ని కార్పొరేషన్ కు అప్పజెప్పకుండానే అత్యుత్సాహంతో ప్రజా ప్రతినిధులు కోరుతున్నారని నిబంధనలకు విరుద్ధంగా కేవలం రూ 5 లక్షల లోపే అయ్యే పనులకు రూ. 15 లక్షల పైగా బిల్లులు డ్రా చేసుకునేందుకు కేటాయింపులు జరిగాయని కార్పొరేషన్ లోని అధికారుల మధ్య చర్చనీయాంశమైంది. ఒకపక్క పశ్చిమ నియోజకవర్గంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే ఈ కార్యక్రమాలను ఈసారి ఈస్ట్ నియోజకవర్గంలో చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయం ప్రతి ఒక్కరినీ ఆనందింప చేసే విషయం అయినప్పటికీ నియోజకవర్గ ప్రజలకు అనుకూలమైన ప్రాంతంలో కాకుండా ఒక దురాశతో కార్మిక శాఖ స్థలంలో ఏర్పాటు చేయడంపై నియోజకవర్గ ప్రాంతాల ప్రజల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. తమ ప్రాంతాలకు దగ్గరగా ఉన్న బిఆర్ స్టేడియంలో పెడితే ఎంత బాగుంటుందని, ఒక్క రూపాయి ఖర్చు లేకుండానే ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించవచ్చని, అయితే లక్షల ఖర్చు చేసి కార్పొరేషన్ సొమ్ముతో ఆ స్థలాన్ని శుభ్రం చేయించి, కనీసం ఆ ప్రాంతానికి వెళ్లేందుకు మార్గాలు కూడా లేకుండా ఉన్న పరిస్థితిలో అక్కడ సంక్రాంతి సంబరాలు నిర్వహించడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బిఆర్ స్టేడియం ఉన్న సంగతి మర్చిపోయారా...? గుంటూరు నగరంలో 90 శాతం ప్రాంతం ఉన్న తూర్పు సంబంధించి ఖి విజిలెన్స్ ఖి అధికారులు విచారణ చేపడితే తమ ఉద్యోగాలు ఎక్కడ పోతాయోనని కార్పొరేషన్ అధికారుల వెన్నులో వణుకు మొదలైంది. అకౌంట్ విభాగం నుంచి మౌఖిక ఆదేశాలతో బిల్లుల చెల్లింపు, ఒక క్రమ పద్ధతి లేకుండా కాంట్రాక్టులకు బిల్లులు ఇవ్వడం, ప్రభుత్వ ఆదేశాలను ఆసరా చేసుకుని అడ్డగోలుగా కోట్ల రూపాయలు కొంతమంది అకౌంట్లోకి సహాయం పేరుతో చెల్లింపులు చేయడం, తిరిగి ఆ సొమ్మును డ్రా చేసి బిల్లులు పెట్టడం వంటి సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ విషయమై ఇప్పటికే కార్పొరేషన్ లో జరిగే అక్రమాలపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన సందర్భం కూడా ఉంది. నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతులు, ఉద్యోగాలు ఇవ్వటం, ఇలా అనేక విషయాలు ఉన్నాయని వీటిపై విజిలెన్స్ అధికారులు విచారణ చేస్తే తమ ఉద్యోగాలు ఎక్కడ పోతాయని కార్పొరేషన్ అధికారుల వెన్నులో వ,ణుకు మొదలైంది. కార్పొరేషన్ లో జరిగే అక్రమాలపై ఎవరైతే ప్రశ్నిస్తారో వారికి పదోన్నతులు కల్పించడం, వారికి తెలియకుండానే అకౌంట్లో డబ్బులు వేయటం, గంటల వ్యవధిలో వారికి తెలియకుండానే తిరిగి తీసుకోవడం, ఈ అక్రమాలలో వారిని కూడా బాధ్యులుగా చేయటం వంటి సంఘటనలు ఒక పథకం ప్రకారం జరిగిపోయాయని, అవి విజిలెన్స్ విచారణలో బయటపడితే అడ్డంగా తొలగిపోయి ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని అనేకమంది అధికారులు భయాందోళనకు గురై వణికి పోయే పరిస్థితి ప్రస్తుతం కార్పొరేషన్ ఉద్యోగులలో చర్చనీయాంశంగా మారింది.

# విన్నర్ ట్రోఫీతో పాటు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

**గుంటూరు విద్య జనవరి 10 ప్రభాతవార్త:** ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఏ.యెన్.యూ) ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ కళాశాల బాల్ బ్యాడ్మింటన్ (మెన్) టోర్నమెంట్లో అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచి విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకోవడంతో పాటుగా, తమ కళాశాల నుండి ముగ్గురు విద్యార్థులు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తరపున పాల్గొనడానికి ఎంపిక కావడం ఆనందదాయకమని కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని హర్షం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా




విన్నర్ ట్రోఫీని సాధించిన క్రీడాకారులను మరియు ఏ.యెన్.యూ జట్టుకు ఎంపికైన విద్యార్థులను కళాశాల సిబ్బంది అభినందించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం చివరి సంవత్సరం విద్యార్థి బి. వెంకట కిషోర్, సి.ఎస్.బి.ఎస్ విభాగం తృతీయ సంవత్సరం విద్యార్థి బి. రఘురాం, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం ద్వితీయ సంవత్సరం విద్యార్థి పి. నరేంద్ర జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం కళాశాలకే గర్వకారణమని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాల కృష్ణ, ట్రెజరర్ డా. కొండబోలు కృష్ణ ప్రసాద్ తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. కోల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్ డి డైరెక్టర్ డా. కె. రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా. ఎన్.వి. శ్రీనివాస రావు, ఫిజికల్ డైరెక్టర్లు డా. పి. గౌరీ శంకర్, డా. ఎమ్. శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కెఎల్ యూనివర్సిటీ మొదటి విడత ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షా ఫలితాలు విడుదల

## -ఆడపిల్లకు చదువే అసలైన ఆస్తి
## -రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత

**తాడేపల్లి, జనవరి 10, ప్రభాతవార్త :** ఆడపిల్లకు చదువే అసలైన ఆస్తి అని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. శనివారం వడ్డేశ్వరంలోని కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో కెఎల్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికై జాతీయస్థాయిలో నిర్వహించిన మొదటి విడత ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష ఫలితాలను మంత్రి విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన మంత్రి అనిత మాట్లాడుతూ కెఎల్‌యులో అడుగుపెట్టగానే రాబోయే తరాన్ని తయారుచేసే కర్మాగారంలో అడుగు పెట్టినట్లుగా భావన కలిగిందన్నారు. ఇంత మంది అమ్మాయిలను ఒక దగ్గర చూడడం ఆనందంగా ఉందన్నారు. తెలుగు వారి కన్నవారికి కడుపుకోత మిగల్చవద్దని తెలియజేశారు. కెఎల్‌యు కార్యదర్శి కోనేరు శివకాంచనలత మాట్లాడుతూ మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో జాతీయ స్థాయిలో నిర్వహించిన మొదటి విడత పరీక్షలో లక్షమంది విద్యార్థులు హాజరయ్యారని, వారిలో 80శాతం మంది విద్యార్థులు అర్హత సాధించారన్నారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడవచ్చన్నారు.





ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా చాటి చెబుతున్న కెఎల్‌యు యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. తన తండ్రి తనకు చదువే అసలైన ఆస్తి అని చెప్పారని తన బాల్యంలోని సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. తాను డిఎస్సీ పాసై ప్రభుత్వ ఉపాధ్యాయినిగా పనిచేసినట్లు తెలిపారు. సిఎం చంద్రబాబు నాయుడి ప్రోత్సాహంతో తాను రాజకీయాల్లోకి ప్రవేశించి రాష్ట్రానికి హోంమంత్రి అయ్యానని చెప్పారు. మోటివేషన్ అనేది ఆడపిల్లకి ఎంత ముఖ్యమో ...మగ పిల్లలకు కూడా అంతే ముఖ్యమన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని పిల్లలు ఎప్పటికీ మరచిపోకూడదని హితవు పలికారు. టెక్నాలజీలో కూడా కెఎల్‌యు చదువుతున్న బాలికా విద్యార్థినులు ముందుండి శాటిలైట్ ప్రయోగాలు చేయడం ఆనందంగా ఉందన్నారు. బాలికలు అపరిచితుల మాయలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ లాంటి సోషల్ మీడియా పరిచయాలను నమ్ముకొని ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలో వచ్చిన ర్యాంకులు, ఇంటర్ మార్కుల ఆధారంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్ ద్వారా ఫీజులో మినహాయింపు ఇస్తామని చెప్పారు. యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ జి.పార్ధసారధి వర్మ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరాలనుకునే మెరిట్ విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ ఎంతగానో ఉపయోగపడతాయని స్పష్టంచేశారు. వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండవ విడత ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షను ఫిబ్రవరి నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి విడతలో పరీక్షలో మెరుగైన ర్యాంకు పొందని విద్యార్థులు రెండవ విడత ప్రవేశ పరీక్ష రాసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కెఎల్ ట్రిపుల్ ఈ కన్వీనర్ డాక్టర్ ఎం.సుమన్, హెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జ్ డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, సలహాదారు డాక్టర్ హబీబుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు గంజాయి కేసుల్లో 11మంది నిందితుల అరెస్టు

**గుంటూరు క్రైమ్, జనవరి10, ప్రభాతవార్త:** గంజాయి కొనుగోలు, అమ్మకాలు చేస్తున్న 11 మంది వ్యక్తులను నగరంపాలెం పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు వారి వద్ద నుండి 4.400 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో విలేకరుల సమావేశం



నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలు నిర్మూలించడమే ధ్యేయంగా జిల్లాలో కార్డెన్ సెర్చ్ పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఈస్ట్ డిఎస్పి కే అరవింద్, నగరంపాలెం సిఐ వై సత్యనారాయణ తమ సిబ్బందితో కలిసి విఐపి రోడ్డులోని కృష్ణబాబు కాలనీ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద నుండి లాల్పురం డొంక రోడ్డులో శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం సమీపంలో శ్రీనివాసరావుపేటకు చెందిన పాలేటి సాల్మన్ రాజు, నగరంపాలెం కి చెందిన గుంజి హేమంత్ రాజు, శ్రీనివాసరావుపేటకు చెందిన సుంకర వంశీకృష్ణ, పట్టాభిపురం రెండవ లైన్ కు చెందిన పాముల రఘురామరాజు, అడపా బజారుకు చెందిన షేక్ నాగుల్ మీరా లను అరెస్టు చేశారు వీరిపై గతంలో కూడా పలు పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు అయ్యాయన్నారు. వీరి వద్దనుండి మూడు కేజీల 200 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అలాగే నగరంపాలెం పరిధిలోని అంకమ్మ నగర్ ఇరిగేషన్ డిపార్ట్మెంట్ కార్యాలయం వెనుక ఖాళీ ప్లేస్ స్థలంలో కొరటిపాడు నాయుడుపేటకు మూడవ లైనుకు చెందిన వేటూరి హేమసాయి అలియాస్ చందు, కొరటిపాడు గౌతమి నగర్ మూడో లైన్ కి చెందిన ముత్తుకూరి సాయిరాం, అదే ప్రాంతానికి చెందిన నాగసాయి ఇతనపై గతంలో పట్టాభిపురం పోలీస్ స్టేషన్ లో పోక్సో కేసు అరండల పేట పోలీస్ స్టేషన్లో దొంగతనం కేసు ఉన్నాయి. హనుమయ్య నగర్ మూడో లైన్ కు









చెందిన షేక్ జాన్ బాషా ఇతను పై కూడా పట్టాభిపురం పోలీస్ స్టేషన్లో పోక్సో కేస్ కలదు. హనుమయ్య నగర్ మూడోలైను కు చెందిన మేళం యేసు మూర్తి, హనుమయ నగర్ మూడో లైన్ కి చెందిన జొన్నలగడ్డ యువరాజు ఇతనిపై అరండల పేట పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనం కేసు ఉంది. వీరిని అదుపులోకి తీసుకొని వీరి వద్దనుండి 1200 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలియ జేశారు. గడిచిన మూడు నెలల్లో 282 మందిపై 46 కేసులు నమోదు చేసి 217 మందిని అరెస్టు చేశామని, 78 కేజీల గంజాయిని 258 గ్రాములు లిక్విడ్ గంజాయిని, 34గ్రాముల లీదీలీతి డ్రగ్ స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని, ఎస్పీ పేర్కొన్నారు. ఇప్పటివరకు ఏడు మంది పై పీడీ యాక్ట్ ప్రయోగించి 14 మందిపై పిటి ఎన్డీ పీఎస్ చట్టం కింద ప్రయోగించడానికి సిఫార్సు చేయడం జరిగిందని ఎస్పీ వెల్లడించారు. దర్యాప్తులో పాల్గొన్న సిబ్బంది ఎస్సై టి రాంబాబు, ఎస్సై ఏ రామచంద్ర రెడ్డి, హెచ్ సి ఎం దాసు, కానిస్టేబుళ్లు ఎస్.కె జాన్ సైదా, తి శ్రీనివాసరావు, దిబీ ఉదయ్ చంద్ర, పి గంగ రాజు, ఎస్. కె అహ్మద్, టాస్కోఫోర్స్ బృందాన్ని ఎస్పీ అభినందించి ప్రశంస పత్రాలు అందజేశారు.

# చదువుతో పాటు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి

## సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి

**గుంటూరు విద్య జనవరి 10 ప్రభాతవార్త:** ప్రతి ఒక్క విద్యార్థి చదువుతో పాటు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకుని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వైజాగ్ చోడవరం సబ్ రిజిస్ట్రార్ బలగ గీతా లక్ష్మి అన్నారు.




శనివారం భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో స్థానిక వికాస్ నగర్ లోని భాష్యం స్పోర్ట్స్ ఎరీనా గ్రౌండ్లో భాష్యం ఒలంపస్ పేరిట భాష్యం సెంట్రల్ లెవల్ ఒలంపస్ క్రీడా పోటీల కార్యక్రమం మొదటి రోజు లాంఛనంగా ప్రారంభమైంది. సబ్ రిజిస్ట్రార్ గీతా లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ జీవితాన్ని సమతుల్యం చేసుకోవాలన్నారు. క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని మీరు ఎంచుకున్న రంగంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. విద్యార్థులను ఆ దిశగా ప్రోత్సహిస్తున్న భాష్యం యాజమాన్యాన్ని ఆమె అభినందించారు. భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ భాష్యం ఒలంపస్ పేరిట మూడు రోజులపాటు క్వార్టర్ ఫైనల్స్, సెమీ ఫైనల్స్, ఫైనల్స్ జరుగుతాయన్నారు. వీటిలో త్రో బాల్, కబడ్డీ, ఖోఖో, క్యారమ్స్, చెస్, రిలే రేస్ పోటీలు జరుగుతాయని వీటితో పాటు జరిగే భాష్యం క్రికెట్ లీగ్ పోటీల్లో 8 జోనల్ జట్లు పాల్గొంటాయన్నారు. తొలుత గీతా లక్ష్మి చేతులమీదుగా జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. భాష్యం ఒలంపస్, భాష్యం జెండాలను ఎగురవేసి క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. పోటీల్లో పాల్గొంటున్న జట్ల నుండి గౌరవ వందనం స్వీకరించారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు ఛైర్మన్ భాష్యం రామకృష్ణ ట్రోఫిలను అందజేశారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, భాష్యం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ లు పాల్గొన్నారు.

# ముగ్గులు సంస్కృతికి సాంప్రదాయాలకు ప్రతీకలు

**గుంటూరు విద్య జనవరి 10 ప్రభాతవార్త:** గుంటూరు స్థానిక సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు కళాశాల కార్యదర్శి కర్పూరపు సూర్యనారాయణ, అధ్యక్షులు పచ్చి జీవితాలలో వెలుగులు తీసుకురావాలని ఆకాంక్షి ంచారు కళాశాలలో ప్రతి ఏడాది ఇలా నిర్వహించటం కళాశాలకు గర్వకారణం అని అన్నారు. కమిటీ మెంబర్ మాజేటి ప్రసాద్ మాట్లాడుతూ నేటి కంప్యూటర్ యుగంలో విలువలు లేని సమాజంలో విలువైన తెలుగు



పులుసు రాఘవరావు ,కమిటీ మెంబర్ మాజేటి ప్రసాద్, మరియు ట్రెజరర్ జయ ప్రకాష్ పాల్గొన్నారు. విద్యార్థులు సాంప్రదాయక దుస్తులైన పంచె, ధోవతి మరియు విద్యార్థినీలు లంగా, వోణీలతో గ్రామస్థాయి వాతావరణాన్ని కలిగించారు ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థినీలకు ముగ్గులు పోటీలు ఏర్పాటుచేసి విజేతలకు బహుమతులను అందించారు మరియు విద్యార్థులకు గాలిపటాలు పోటీలను నిర్వహించారు. ఈ ఈ పోటీలలో విద్యార్థిని విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి కర్పూరపు సూర్యనారాయణ మాట్లాడుతూ ముగ్గులు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు ఈ విధంగా వేడుకలను ఏర్పాటు చేసుకోవడం పడిపోతున్న సాంప్రదాయాలను గౌరవించడమే అని అన్నారు. కళాశాల అధ్యక్షులు పచ్చిపులుసు రాఘవరావు మాట్లాడుతూ తెలుగు సాంప్రదాయానికి ప్రతికైన సంక్రాంతి పండుగ అందరి పండుగ సంక్రాంతిని ఇంత గొప్పగా చేసుకోవడం ఆనందించ తగిన విషయమనియు పండుగ సమయాలలోని నిజమైన ఆనందం దొరుకుతుందని అన్నారు. తొలుత కళాశాల ప్రాంగణమంతా చెరుకు గడలతోనూ, గాలిపటాలతోనూ అలరించారు విద్యార్థులు తమ ఇండ్ల నుండి తెచ్చిన బొమ్మలతో బొమ్మల కొలువు ఏర్పాటు చేసి చిన్నారులపై భోగి పండ్లను పోశారు. గొబ్బెమ్మలను ఏర్పాటు చేసి బాలికలు చుట్టూ తిరుగుతూ నృత్యాలను చేశారు. చివరిగా కళాశాల విద్యార్థిని విద్యార్థులు తమ తమ గృహము నుండి వండుకు వచ్చిన వివిధ రకములైన సాంప్రదాయ వంటలను విచ్చేసిన అతిథులకు, తల్లిదండ్రులకు, విద్యార్థిని విద్యార్థులకు తినిపించుట ద్వారా ఈ కార్యక్రమము ఎంతో ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మహంకాళి శ్రీనివాసరావు, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ ఏ. శ్రీధర్, వై. చంద్రశేఖర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుభద్ర, జి. సి.ఎస్. ఎస్. హై స్కూల్ హెచ్.ఎం రమాదేవి, విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# స్పైస్ బోర్డు డైరెక్టర్ కొత్తూరి వెంకట సుబ్బారావు కు సత్కారం

**గుంటూరు విద్య జనవరి 10 ప్రభాతవార్త:** స్పైస్ బోర్డ్ డైరెక్టర్ గా నియమితులైన శ్రీ కొత్తూరి వెంకట సుబ్బారావు గారిని అభినందిస్తూ భారతీయ జనతా



పార్టీ మూడో మండల అధ్యక్షురాలు గాయత్రి బెహరా ఆధ్వర్యంలో బ్రాడీపేట 3/9 లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జూపూడి గంగరాజు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ లో కష్టపడే వ్యక్తులకు పదవులు వస్తాయి అని భారతీయ జనతా పార్టీ కార్యకర్తల పార్టీ అని కొత్తూరి వెంకట సుబ్బారావు చిన్నతనం నుండి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘంలో బాధ్యతలు నిర్వహించి భారతీయ జనతా పార్టీలో అంచలంచలుగా ఎదిగారని ఆయన కార్యకర్తలకు ఎప్పుడు చాలా దగ్గరగా ఉంటారని అలాగే పిలవగానే పలుకుతారని ఎంతో నిబద్ధత ఉన్న కార్యకర్త అని వారు బిజెపి జిల్లా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఐదుగురు కార్పొరేటర్లను ఇద్దరు కో ఆప్షన్ సభ్యులను గెలిపించిన ఘనత వారిది అని పేర్కొన్నారు. తర్వాత స్పైస్ బోర్డ్ డైరెక్టర్ గా ఎన్నిక కాబడిన శ్రీ కొత్తూరి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ తనకు ఈ బాధ్యత రావడానికి సహకరించిన ప్రతి ఒక్క భారతీయ జనతా పార్టీ కార్యకర్తకు ముందుగా అభినందనలు తెలియజేసినారు. భారతీయ జనతా పార్టీలో కష్టపడే కార్యకర్తలకు న్యాయం జరుగుతుంది అని చెప్పడానికి వారికి వచ్చిన బాధ్యతే ఉదాహరణ అని పనిచేసే కార్యకర్తలను భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ గుర్తుంచుకుంటుంది అని కాకపోతే ఒకరికి ముందు ఒకరికి వెనకగా బాధ్యతలు వస్తాయని. . ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు శ్రీ చెరుకూరు తిరుపతి రావు, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు నేరెళ్ల మాధవరావు, పునుగుండ్ల రవిశంకర్ ,పాలపాటి రవికుమార్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ , భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సాదు రామకృష్ణ , ప్రధాన కార్యదర్శులు బజరంగ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ, కోకా రాజేష్ నాయుడు మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శనక్కాయల రాధా మాధవి , మాధవ రెడ్డి, పావని మరియు వివిధ మండలాల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

# సాంప్రదాయ శోభతో జైన్ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాల సందడి

**గుంటూరు విద్య జనవరి 10 ప్రభాతవార్త:** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని జైన్ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, విద్యార్థినులు రంగురంగుల సాంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని భోగి, సంక్రాంతి, కనుమ పండుగల విశిష్టతను చాటిచెప్పారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, రైతుల కృషి ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాటలు, నృత్యాలు, సంప్రదాయ వేషధారణలతో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణంతో కళకళ లాడింది. ఈ సందర్భంగా జైన్ హైస్కూల్ డైరెక్టర్ డాక్టర్ మహమ్మద్ మున్నా మాట్లాడుతూ, పండుగలు మన సంస్కృతిని భావిత రాలకు చేరవేసే ఉత్తమ సాధనమని



అన్నారు. సంక్రాంతి వంటి పర్వదినాలు విద్యార్థుల్లో సామాజిక ఐక్యత, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. పాఠశాల స్థాయిలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో సాంస్కృతిక చైతన్యం పెరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన కార్యక్రమాలు ఎంతో హృద్యంగా ఉండి అందరినీ ఆకట్టుకున్నాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంక్రాంతి సంబరాలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జైన్ హై స్కూల్ ప్రిన్సిపల్ కనకదుర్గ ఇంకా ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కనిగిరి నుంచి మార్కాపురం జిల్లా కేంద్రానికి నూతన బస్సు సర్వీసు ప్రారంభం

**కనిగిరి, జనవరి 10, ప్రభాతవార్త :** ప్రయాణికుల సౌకర్యార్థం సోమవారం ఉదయం 8గంటలకు కనిగిరి నుంచి మార్కాపురం జిల్లా కేంద్రానికి నూతన బస్సు సర్వీసును కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రారంభించనున్నట్లు కనిగిరి డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ అధికారులు, ఆర్టీసీ ఉన్నత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈ నూతన సర్వీసుతో కనిగిరి ప్రాంత ప్రజలు విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులకు మెరుగైన ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణించాలని కోరారు.

# కబడ్డీ పోటీల నిర్వహణ గర్వకారణం : ఏఈ మాధవరెడ్డి

**బల్లికురవ, జనవరి 10, ప్రభాతవార్త :** భారతదేశ సంస్కృతిలో భాగమైన కబడ్డీ పోటీలను నిర్వహించటం గ్రామ సీమలకు గర్వకారణమని పంచాయతీ రాజ్ ఏఈ మాధవరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొప్పెరపాడు గ్రామంలో ఫ్రెండ్స్ సర్కిల్ నాలుగో వార్షికోత్సవంలో భాగంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 20వ శతాబ్దంలో నియమాలు రూపొందించబడి, పోటీ క్రీడగా కబడ్డీ ఆవిర్భవించింది అన్నారు. నేటి పోటీ యుగంలోనూ గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాల వరకు కబడ్డీ లీగ్ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా మారిందన్నారు. కబడ్డీ పోటీలలో ముఖ్యంగా శక్తి వ్యూహాం, వేగం, శ్వాస నియంత్రణలకు పరీక్ష లాంటిది అన్నారు. గ్రామీణ క్రీడల్లో యువకులు రాణిస్తే, జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకునేందుకు మార్గం ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్న ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులను ఆయన అభినందించారు.

# ఘనంగా సంక్రాంతి వేడుకలు

పెదనందిపాడు జనవరి 9 (ప్రభాతవార్త). పెదనందిపాడు ఎల్ఎంహెచ్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ దాసరి శేషగిరిరావు. ముద్దన నాగరాజుకుమారి. అరవపల్లి కృష్ణ. రాఘవయ్య తదితరులు మాట్లాడుతూ. కంప్యూటర్ . సెల్ ఫోన్ లు మాయలో పడి విద్యార్థులు మన పురాతన సంప్రదాయాలను వదిలి వేస్తున్నారని. భోగి. సంక్రాంతి .కనుమ .పండుగల విశిష్టత వివరిస్తూ విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉండే విధంగా ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులు తల్లిదండ్రులు పాలకవర్గ కమిటీ సభ్యులు సంప్రదాయ దుస్తుల్లో చిన్నారులకు భోగి పళ్ళ పోశారు. భోగి మంటలు కార్యక్రమం నిర్వహించారు. సంక్రాంతి పండగ పొంగళ్ళు కోలాటాల ప్రదర్శనలు నిర్వహించారు. గాలిపటాలు ఎగరవేశారు. ముగ్గుల పోటీలను నిర్వహించారు. పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల పాలకవర్గం వారు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాసరి సత్య నారాయణ. డిఎల్ఎస్ ప్రసాద్. కే ఉమామహేశ్వరరావు. పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్ జోష్. బాజీ మున్ని. యామిని .ధనలక్ష్మి. సిహెచ్ నరేష్ కుమార్ .లోకయ్య తదితరులు పాల్గొన్నారు..





# భక్తి శ్రద్ధలతో ధనుర్మాసోత్సవాలు

పొన్నూరు, జనవరి 10,ప్రభాతవార్త: పట్టణంలో వేంచేసియున్న శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మి సమేత సాక్షి శ్రీ భావనారాయణస్వామివారి దేవాలయంలో శ్రీ గోదాదేవి అమ్మవారికి విశేషార్చనలు, విశేష అలంకరణలు నిర్వహిస్తున్నారు. తిరుప్పావై పాశురములను పఠించి, అందుకు సంబంధించిన



ధనుర్మాసోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కన్నుల పండువగా జరుగుతున్నాయి. వేకువ జామునుంచే భక్తులు తలంటు స్నానాలు ఆచారించి అత్యంత భక్తిశ్రద్ధలతో దేవాలయానికి వచ్చి శ్రీ గోదాదేవి అమ్మవారిని దరి ్శంచుకొంటున్నారు. దేవాలయం ఫలితాన్ని అర్చకస్వాములు వివరిస్తున్నారు. ముందుగా పేర్లు నమోదు చేసుకొన్న భక్తుల పేరున గోత్రనామ అర్చనలు జరుగుతున్నాయి. అత్యంత పురాతనమైన దేవాలయం, అత్యంత మహిమ గల స్వామిగా పేరొందడంతో భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతున్నారు. భక్తులకు తీర్థ ప్రసాద గోష్ఠి జరుగుతుంది. అనంతరం శ్రీ గోదాదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలోకి వేంచేపుచేసి స్వర్ణపురి పట్టణ పురవీధుల్లో భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకస్వామి గోవర్ధనం రామకృష్ణ, గౌతమ్ తదితరులు పూజాధికార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దేవాలయం సిబ్బందితోపాటు ధర్మకర్తల మండలి సభ్యులు శిఖాకొల్లి గుర్నాధరావు, గుడివాడ పవన్,ఆకురాతి శ్రీనివాసరావు తదితరులు ఏర్పాట్లు చేశారు.

**నేడు కూడార్తై వేడుక:** స్థానిక సాక్షి శ్రీ భావనారాయణస్వామి దేవాలయ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ గోదాదేవి అమ్మవారికి ధనుర్మాసోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం 6గంటలకు కూడార్తై వేడుక జరుగుతుందని అసిస్టెంట్ కమిషనర్ గాండ్ల కామేశ్వరమ్మ తెలిపారు. ధనుర్మాసంలో అత్యంత ప్రముఖమైన వేడుకగా కూడార్తై వేడుకను చెప్పుకొంటారని చెప్పారు.

# సందడిగా సాగిన విజె కాలేజ్ ఫేర్‌వెల్ వేడుక

## సీనియర్లకు జూనియర్ల ఆత్మీయ వీడ్కోలు

మంగళగిరి, జనవరి 10, ప్రభాతవార్త: స్థానిక వి.జె. జూనియర్ కళాశాల విద్యార్థుల వీడ్కోలు దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. తరగతులు పూర్తి చేసుకుని వెళ్తున్న సీనియర్ చదువుకుని తల్లిదండ్రులకు, సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సీనియర్ విద్యార్థులు కళాశాలలో తమ జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం విద్యార్థులు




విద్యార్థులకు, జూనియర్లు ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ప్రెగడ రాజశేఖర్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమ శిక్షణతో ప్రవర్తిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించగలరన్నారు .క్రమశిక్షణతో కూడిన జీవితం విజయానికి సోపానమని, విద్యార్థులు బాగా తమ అధ్యాపకులకు జ్ఞాపికలను అందజేశారు. అనంతరం విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆటపాటలతో అలరించారు.ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సి పాల్ అవ్వారు సత్యనారాయణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాదెళ్ల శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ గంజి లక్ష్మి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# సమయం అమూల్యమైనది భవిష్యత్తును తీర్చిదిద్దుకోండి

## -ప్రిన్సిపాల్ వీర రాఘవయ్య

పెదనందిపాడు జనవరి 10 (ప్రభాతవార్త): కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి వీరరాఘవయ్య మాట్లాడుతూ సమయం అమూల్యమైనదని దాన్ని సద్వినియోగపరుచుకుని విద్యార్థులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోలన్నారు. పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో



శనివారం ఏర్పాటు చేసిన ఎంపీసీ విద్యార్థుల వీడ్కోలు సభలో వారు మాట్లాడారు. ఈ సభకు ఫిజిక్స్ విభాగం హెచ్.ఓ.డి డి. గీతా లక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె. ప్రతాప్ కుమార్, ఎన్.సి.సి ఆఫీసర్ డాక్టర్ పి. శ్రీనివాస్. సి.ఎల్.ఎస్ రెడ్డి , కే.వినోద్ కుమార్ , పి.గ్రేస్ విక్టోరియ, జె.భవాని, పి.నవ్య, కె. శ్రీనివాస్ మూర్తి, సి.హెచ్ సాయి స్వాతి, డి. శ్రీనివాస్, జె.శరత్ కుమార్, జి.హరిప్రసాద్‌లు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థు లు స్థిరంగా నేర్చుకోవడం, ప్రశ్నించడం మరియు సవాళ్లను స్వీకరించడం ద్వారా మీరు మీ పరిమితులను విస్తరించుకోవచ్చు అన్నారు. మీ జీవితాన్ని "ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడం" అంటే, మీ సంపూర్ణ సామర్థ్యాన్ని అన్వేషించడం మరియు సమాజానికి సహాయకరంగా ఉండడం. కనుక ప్రతి రోజు మీ నైపుణ్యాలను మెరుగుపర్చడం ద్వారా ఇది సాధ్యమౌవుతుంది అన్నారు. తల్లిదండ్రులు మరియు అధ్యాపకులు మీ విజయాలకు మూల స్తంబాలని మీ విజయాలు మీ వ్యక్తిగత విజయాలు మాత్రమే కాదు, మీ కుటుంబం, మీ సమాజం యొక్క విజయాలు కూడా. మీ ప్రయాణంలో ఆశలను నిజం చేయడానికి మీరు చేసే ప్రతి చిన్న కృషి ముఖ్యమైనదిగా పేర్కొన్నారు.

# తిరుమల శెట్టి కొండలరావుకు శ్రీకృష్ణదేవరాయలు, శ్రీ పొట్టి శ్రీరాములు పేరిట పురస్కారం

మంగళగిరి, జనవరి 10, ప్రభాతవార్త : మంగళగిరి నియోజకవర్గ జనసేన సీనియర్ నాయకులు తిరుమల శెట్టి కొండలరావుకు ఆంధ్ర రాష్ట్ర సృజనాత్మక సాంస్కృతిక సేవా సమితి, విజయశ్రీ సాంస్కృతి సేవా సమితి జాతీయ సేవా పురస్కారాన్ని అందించింది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి శ్రీకృష్ణదేవరాయలు, పొట్టి శ్రీరాములు పేరిట ఈ సంస్థ జాతీయ పురస్కారాలు అందిస్తోంది. రాజకీయ రంగంలో



ఉంటూ వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తిరుమలశెట్టి కొండలరావుకు సంస్థ అధ్యక్షులు బండారు నరసింహారావు, ప్రముఖ ఆధ్యాత్మిక గురువు కరుణ శ్రీ స్వామీజీ చేతుల మీదుగా అందుకున్నారు. విజయవాడ గాంధీ నగర్ లోని వెనిగళ్ళ హనుమంతరాయ గ్రంథాలయం ఫంక్షన్ హాల్లో ఈ వేడుకను శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత తిరుమల శెట్టి కొండలరావు మాట్లాడుతూ.. సంక్రాంతి అంటేనే సంబరాలు అని అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి ఏటా ఈ సంస్థ ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేయడం చాలా సంతోషకరమని అన్నారు. సంస్థ ప్రతినిధులు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సిద్ధాంతి శ్రీనివాస్ రెడ్డి, సినీ నటులు వ్యాఖ్యాత కొప్పుల అశోక్ ఆనంద్, పలు రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

# ఆర్ఎంపి,పిఎంపి లకు సీజనల్ వ్యాధుల పై అవగాహన సదస్సు

గుంటూరు విద్య జనవరి 10 ప్రభాతవార్త : "శ్రీ విజయాస్" కోస్టల్ కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆర్ఎంపి పిఎంపి లకు. కమ్యూనిటీ పారా మెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమావేశం శనివారం గుంటూరులో ఘనంగా జరిగింది. కోస్టల్ కేర్



హాస్పిటల్స్ చైర్ పర్సన్ పి. విజయలక్ష్మి అధ్యక్షతన రెవెన్యూ కల్యాణమండంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని డి ఎం హెచ్ ఓ విజయలక్ష్మి అతిథిగా హాజరై ప్రసంగించారు. సీజనల్ వ్యాధు లకు సంబంధించిన ఫిర్యాదులు ముందుగా ఆర్ఎంపీలకే తెలుస్తాయని, సీజనల్ వ్యాధుల సమాచారాన్ని వైద్యశాఖా అధికారులకు తెలియజేయడంలో ఆర్ఎంపి లు ముందుంటారని కొనియాడారు. విజయాస్ కోస్టల్ కేర్ హాస్పిటల్స్ సీజనల్ వ్యాధుల పై అవగాహన కల్పించడం శుభపరిణామం అని కొనియాడారు. డాక్టర్ మేఘన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వీరి పాత్ర కీలకమని, అన్నారు. డాక్టర్లు శ్రావణ్ కుమార్, మోహన్ రామ్, మీనాకుమారి, ప్రభాకర్ శివ, యోగి, ప్రియాంక ఆర్.ఎం.పి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సత్తార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శేషసాయి తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచవ్యాప్తంగా రోటరీ సేవలు ఎనలేనివి

## -రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎస్.వి.రాంప్రసాద్

పొన్నూరు, జనవరి 10,ప్రభాతవార్త: ప్రపంచవ్యాప్తంగా రోటరీ సంస్థ ఎనలేని సేవలను అందిస్తూ ముందుకు దూసుకెళ్తుందని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎస్.వి.రాంప్రసాద్ అన్నారు. రోటరీ గవర్నర్ పర్యటన సందర్భంగా పట్టణంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్వి రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పోలియోను రూపు మాపడంలో రోటరీ సేవలు ప్రశంసనీయమన్నారు. ప్రస్తుతం విద్యా,వైద్య రంగాలలో అనేక సేవలు చేస్తూ ముందుకు సాగుతుందన్నారు. పొన్నూరు రోటరీక్లబ్ చేస్తున్న సేవలను కొనియాడారు. అధ్యక్షుడు జిఎంఎస్ గుప్తా, కార్యదర్శి యాసం వీరయ్య, వీరి బృందం మరిన్ని సేవా కార్యక్రమాలు చేసి మంచి పేరు పొందాలన్నారు. పొన్నూరు క్లబ్ సేవా కార్యక్రమాలు చేయడంలోనూ క్లబ్ సభ్యులను చేర్పించడంలోనూ ముందంజలో ఉందన్నారు. అమ్మసేవా నిలయం, వృద్ధాశ్రమంలోని వృద్ధులకు క్లబ్ తరపున దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. క్లబ్ కార్యదర్శి యాసం వీరయ్య మాట్లాడుతూ పొన్నూరు రోటరీక్లబ్‌లోని




సభ్యులందరూ సంయుక్తంగా సేవా కార్యక్రమాలకు సహకరిస్తుండడం వల్లే సేవా కార్యక్రమాలు చేయడంలో ముందంజలో ఉన్నామన్నారు. రోటర్లీక్లబ్ బలోపేతానికి కూడా శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ పూర్ణచంద్ర, పాములపాటి రవీంద్రనాథ్, నారాయణం మేఘనాథ్, కొత్తమాసు రామకృష్ణ, తోట భానుప్రసాద్, బి.రామారావు, శివరామకృష్ణ, మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవి రాకేష్‌దేవ్, నన్నపనేని బాలకృష్ణ, ముప్పాళ్ళ రమేష్‌బాబు, డాక్టర్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఆకలితో ఉన్నవారికి పట్టెడన్నం పెట్టాలి

## -బిజెపి రీజినల్ ఛైర్మన్ పరాశరం రంగవల్లి

పొన్నూరు, జనవరి 10,ప్రభాతవార్త: ఆకలితో ఉన్నవారికి పట్టెడన్నం పెట్టడ మానవ ధర్మమని లయన్స్‌క్లబ్ రీజినల్ ఛైర్మన్ పరాశరం రంగవలి అన్నారు. ఫీడ్ ద హంగర్ కార్యక్రమంలో భాగంగా స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులని



సాయిబాబా మందిరం వద్ద పేదలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రంగవల్లి మాట్లాడుతూ లయన్స్‌క్లబ్‌లు వారం రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ఎంతో మంది ఆకలిని తీర్చాయన్నారు. సేవా కార్యక్రమాలు చేయడంలో లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళ ముందంజలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు బేతాళ ఝాన్సీ రాణి, శోభా కలూష, మన్నవ అనసూయాదేవి,కృష్ణకుమారి, పి.నిర్మల, పి.మోహనలక్ష్మి, బి.శబలాదేవి తదితరులు పాల్గొన్నారు.

# కండక్టర్ రహీంసాహెబ్‌కు ఉత్తమ పురస్కారం

పొన్నూరు, జనవరి 10,ప్రభాతవార్త: రోటరీ ఇంటర్నేషనల్ పొన్నూరు వారి ఆధ్వర్యంలో కండక్టర్ రహీంసాహెబ్‌కు ఉత్తమ కవి పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాంప్రసాద్



మాట్లాడుతూ తెలుగుభాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గాయకులు, కవులు, రచయితలు తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తూ వివిధ సామాజిక అంశాలకు సంబంధించిన పుస్తకాలు, కవితలు, వ్యాసాలు వ్రాసి సమాజాన్ని చైతన్యపరచాలన్నారు. సంగీత, సాహిత్యాలకు విశేషంగా కృషి చేస్తున్న రహీంసాహెబ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యాసం వీరయ్య, జిఎంఎస్ గుప్తా, రోటరీక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# సేవే లయన్స్‌క్లబ్‌ల ధ్యేయం

## లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నన్నపనేని రఘునాథ్

పొన్నూరు, జనవరి 10,ప్రభాతవార్త: సేవే లయన్స్‌క్లబ్‌లు ధ్యేయంగా పనిచేస్తున్నాయని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నన ్నపనేని రఘునాథ్ అన్నారు.




మండల పరిధిలోని బ్రాహ్మణకోడూరు గ్రామంలోని ఛైల్డ్ హోమ్‌లోని పిల్లలకు ఫీడ్ ది హంగర్ కార్యక్రమంలో భాగంగా హారాన్ని అందజేశారు. అధికశాతం పిల్లలు సరైన ఆహారం లభించక అనేక రోగాలకు గురవుతున్నారన్నారు. అలాంటి వారికి చేయూతనిచ్చేందుకు లయన్స్‌క్లబ్‌లు పనిచేస్తున్నాయన్నారు. లయన్స్‌క్లబ్ సభ్యులు భవన నిర్మాణానికి తమవంతుగా ఆర్థిక సహాయాన్ని చేశారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ లయన్లబ్ తరపున ఎన్నో సేవా కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాలు, ప్రోత్సహాలు అందజేస్తున్నామన్నారు. అనంతరం పిల్లలందరికీ స్వయంగా భోజనాలను వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఆకుల సాంబశివరావు, సూరా రామారావు,పబ్బిశెట్టి త్రినాథ్‌గుప్తా, నరసింహాచారి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# చేబ్రోలు ఆర్‌విఐటీలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

చేబ్రోలు(పొన్నూరు), జనవరి 10,ప్రభాతవార్త: మండల కేంద్రమైన చేబ్రోలులోని ఆర్‌విఐటి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌విఐటి కళాశాల ఛైర్మన్ ఆర్. వంశీకృష్ణ మాట్లాడుతూ తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేసేందుకే ముందస్తుగా సంక్రాంతి సంబరాలను నిర్వహించినట్లు చెప్పారు. సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో నిర్వహించే వివిధ కార్యక్రమాలను కళాశాలలో నిర్వహించడం వల్ల విద్యార్థులకు తెలుగువారి పండుగలపై అవగాహన కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఉదయాన్నే భోగి మంటలను వేసి వేడుకలకు స్వాగతం పలికారు. సంబరాల సందర్భంగా రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులతో కోలాటాలు, హరిదాసుల సంకీర్తనలు,



సాంప్రదాయ దుస్తుల పోటీలు తదితరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్.వి.కృష్ణయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మల్లికార్జున, డిప్లొమా ప్రిన్సిపాల్ డి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎన్‌టిలో వెల్లివిరిసిన సంక్రాంతి శోభ

- -ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు
- -తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలు గుర్తెరగాలి
- -రంగవల్లులు-కోలాటాలతో ఉట్టిపడిన తెలుగు సంస్కృతి
- -ఎన్ఎన్‌టి డైరెక్టర్ కొలిపర్తి శివనాగేశ్వరరావు

పొన్నూరు, జనవరి 10,ప్రభాతవార్త: నేటి ఆధునిక కాలంలో తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకునే తీరిక కూడా లేకుండా మనం గడుపుతున్నామని, ఇదే విధంగా కొనసాగితే రాబోయే తరానికి మన సంస్కృతి గురించి తెలియదని, తెలుగు సంస్కృతిని, సంప్రదాయాలను, పండుగలను తెలియజెప్పేందుకే సంబరాలకు స్వాగతం పలికారు. అనంతరం తలంటు స్నానాలు ఆచరించి సాంప్రదాయ కూర్చొండబెట్టి ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు భోగి పండ్లను పోశారు. ఓ విద్యార్థి హరిదాసు వేషంలో సంకీర్తనలు పాడుతూ అలరించారు. కొంత మంది విద్యార్థినులు కోలాటాలు, ఇతర ఆటలతో ఉత్సాహంగా గడిపారు. సాంప్రదాయ దుస్తుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విద్యార్థినీ విద్యార్థులు ఎవరికి ఎవరూ తీసిపోరనే రీతిగా







ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించామని ఎన్ఎన్‌టి స్కూల్ డైరెక్టర్ కొలిపర్తి శివనాగేశ్వరరావు అన్నారు. స్థానిక సాయి నగర్‌లోని ఎన్ఎన్‌టి హైస్కూల్‌లో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాల్లో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా సాంప్రదాయబద్ధంగా పాల్గొన్నారు. వేకువజామున ఆరు గంటలకల్లా పాఠశాలకు వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు తొలుత భోగి మంటలు వేసి వస్త్రాలు ధరించి పాఠశాలకు వచ్చారు. పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులు లింగ బేధం లేకుండా ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. వివిధ రకాల రంగులను తెచ్చి....తన ముగ్గుకే మొదటి బహుమతి రావాలనే ఉత్సాహంతో రంగవల్లులను చక్కగా తీర్చిదిద్దారు. పలువురు ఉపాధ్యాయినులు సాంప్రదాయబద్ధంగా కట్టెల పొయ్యి వెలిగించి పొంగళి తయారు చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. చిన్నారులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై వివిధ వేషధారణల్లో కనువిందు చేశారు. ఉపాధ్యాయినులందరూ కరస్పాండెంట్‌తో కలిసి సాంప్రదాయ నృత్యంలో పాల్గొన్నారు. ఏది ఏమైనా మొత్తం మీద ఎన్ఎన్‌టిలో జరిగిన సంబరాల్లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు నూతనోత్సాహాన్ని అందించాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కొలిపర్తి బాపారత్నం, పాఠశాల ఇన్‌చార్జి వెలనాటి రామదాసు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డను పుట్టనిద్దాం...స్వేచ్ఛగా ఎదగనిద్దాం

తాడేపల్లి,జనవరి 10,ప్రభాతవార్త : గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టులో భాగంగా తాడేపల్లి మండలం గుండిమెడ గ్రామం సరోజిని నాయుడు బాలల పార్లమెంట్ గ్రూప్‌నందు శనివారం చిన్నపిల్లలపై కిశోర బాలికలపై జరుగుతున్న లైంగిక దాడుల గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా చైల్డ్ రైట్స్ ప్రాజక్టు కో-ఆర్డినేటర్ సిస్టర్ విద్యా మాట్లాడుతూ బాలలపై జరిగే దాడులు మూడురకాల వేధింపులు జరుగుతున్నాయన్నారు.శారీరక,లైంగిక,మానసిక వేధింపులపై శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ భారతదేశంలో చేసిన ఒకసర్వేలో బాలలు ముఖ్యంగా పసిపిల్లలు,1-16సంవత్సరాల మధ్య వయస్సు వారు ఎక్కువ హింసకు అత్యాచారానికి గురవుతున్నారని తెలిసిందన్నారు.మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్,అస్సాం,బీహార్,ఢిల్లీలలో ఎక్కువశాతం బాలల శ్రమదోపిడీకి గురవుతున్నారన్నారు.నాగమణి మాట్లాడుతూ లైంగిక వేదింపులు రోజురోజుకు గణనీయంగా పెరిగి పోతున్నాయన్నారు.కార్యక్రమంలో అత్తోట పోతురాజు,సరోజినీ నాయుడు బాలల పార్లమెంట్,కల్పనా చావ్లా,కిశోరి బాలికల గ్రూప్ సభ్యులు,ఆశావర్కర్ మేకల విజయరాణి,తదితరులు పాల్గొన్నారు.



# హిందూ ఫార్మసీ కళాశాలలో ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు

గుంటూరు విద్య జనవరి 10 ప్రభాతవార్త : స్థానిక అమరావతి రోడ్డు నందు గల హిందూ ఫార్మసీ కళాశాలలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.వి. నాగభూషణం తెలియచేశారు.ఈ కార్యక్రమానికి కళాశాల శ్రీ జూపూడి రంగరాజు అధ్యక్షత వహించి మన సంస్కృతి సాంప్రదాయాలను ఈ తరం విద్యార్థిని విద్యార్థులకు తెలియచేయటానికి సంక్రాంతి పండుగను ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నామన్నారు.ఈ సందర్భంగా కళాశాలలో రంగు రంగుల ముగ్గులు, బొమ్మల కొలువు, భోగి మంటలు, గాలిపటాల పోటీలు మరియు సాంప్రదాయ వస్త్రధారణతో సందడి చేసారు. భోగి, సంక్రాంతి మరియు కనుమల విశిష్టతలను తెలియచేస్తూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ శ్రీ జూపూడి రంగరాజు గారు, గౌరవ చైర్మన్ డా. ఎం. రాధాకృష్ణమూర్తి గారు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల కమిటి సభ్యులు శ్రీ ఎస్.వి.ఎస్.లక్ష్మినారాయణ , వైస్ ప్రిన్సిపాల్ డా.ఎ.ప్రత్యూష, ఫార్మా డి. డైరెక్టర్ డా.పి సీతారామయ్య, కల్చరల్ కమిటీ కోఆర్డినేటర్స్ డా.జి. ఇందిరా ప్రియదర్శిని, డా.వి.మోనిక తదితర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.




# కొత్త ప్రయోగాలకు వేదికగా గుంటూరు కళాపరిషత్

గుంటూరు కల్చరల్,జనవరి 10,ప్రభాతవార్త : కొత్త కొత్త ప్రయోగాలకు వేదికగా గుంటూరు కళాపరిషత్ గత 28సంవత్సరాలుగా సాగుతుందని కళాపరిషత్ అధ్యక్షులు పి.వి.మల్లికార్జున రావు అన్నారు. గుంటూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో 28వ వార్షిక నాటకోత్సవాల ప్రారంభ సభకు ఆయన అధ్యక్షత వహించి ప్రసంగిస్తూ కళాపరిషత్ సమయపాలన పాటిస్తూ నడుస్తుందన్నారు.ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షులు గుదేపాండు రంగరావు ఆత్మీయ అతిథిగా హాజరై ప్రసంగిస్తూ గుంటూరు కళాపరిషత్ నడపడం సాధారణ విషయం కాదన్నారు.అనంతరం మనిషికన్నా కాలం శక్తివంతం,మాయాజాలం తదితర నాటకాలను ప్రదర్శించారు.



